RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8

సంచిక (Issue) : 338 వెల - రూ 5:00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

శనివారం 29, ఏప్రిల్ 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## ఇంకెన్నాళ్లు.. దర్యాప్తు..?

- టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు
- ఎప్పటిలోగా దర్యాప్తు పూర్తి చేస్తారు
- సిట్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- విచారణ జూన్ 5కు వాయిదా

**హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును ఎప్పటిలోపు దర్యాప్తు పూర్తి చేస్తారని సిట్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఈ కేసుపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఏసీపీ నర్సింగ్ రావు హై కోర్టకు నేరుగా హాజరయ్యారు. పేపర్ లీకేజీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రవీణ్ గ్రూప్ 1 రాసేందుకు

మిగతా... 2లో



## ప్రజలను మభ్య పెట్టడానికే
## వందసీట్ల మంత్రం

- తెలంగాణకు ఏం చేశారో చెప్పలేని స్థితి
- అధికారం ఊడటం ఖాయమన్న బండి

**హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** బిఆర్ఎస్ ప్లీనరీ తీర్మానాల వల్ల దేశానికి, రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. వంద సీట్లు గెలుస్తామని ప్రకటించడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం తప్ప మరోటి లేదన్నారు. కేవలం మభ్య పెట్టే యత్నాల్లో కెసిఆర్ ఉన్నారని విమర్శించారు. బిఆర్ఎస్ తన పాలనలో

మిగతా... 2లో



# తెలంగాణ రాజసం..
# కొత్త పాలనా సౌధం

- తెలంగాణ ఐకానిక్ భవనంగా సచివాలయం
- 30న కెసిఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- అత్యంత అధునాతనంగా నిర్మాణం
- ఇందులో అన్నీ ప్రత్యేకతలే అన్న మంత్రి వేముల

**హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** తెలంగాణ సచివాలయం అత్యంత సువిశాలమైనదని, ఇటువంటి ప్రత్యేకతలు కలిగిన భవనం దేశంలో ఎక్కడా లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణకు ఇదో మకుటాయమానంగా నిలుస్తుందని ప్రకటించారు. చెప్పాలంటే ఇదో ఐకానిక్ భవనంగా నిలుస్తుందని అన్నారు. కెసిఆర్ దూరదృష్టికి ఇది నిదర్శనమని అన్నారు. మంత్రులు, అధికారులు ఒకేచోటు నుంచి పనిచేసేలా సచివాలయంలో ఏర్పాట్లు జరిగాయిన అన్నారు. కేంద్రం నిర్మిస్తున్న నూతన పార్లమెంటు భవనం సెంట్రల్ విస్టాకన్నా మన సచివాలయం విశాలమైనదని అన్నారు. ఎన్నో ప్రత్యేకతలతో కూడిన మన సచివాలయం పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట ఆత్మగౌరవ ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముందస్తు ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ ఫలితంగా 20 నెలల్లోనే సచివాలయ నిర్మాణం సాకారమైందని అన్నారు. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 30న అత్యంత వైభవంగా సచివాలయాన్ని ప్రారంభించనున్నామని చెప్పారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. కేంద్రం నిర్మిస్తున్న నూతన పార్లమెంటు భవనం సెంట్రల్ విస్టా వైశాల్యం 6,98,270 చదరపు అడుగులు కాగా, మన సచివాలయాన్ని 10 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించారు. మరే ఇతర రాష్ట్రంలోనూ ఇంత విశాలమైన, సమీకృత సచివాలయం లేదు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే విధంగా డిజైన్ చేయడంతో పాటు గదుల ఎత్తు కూడా 14 అడుగులుగా నిర్మించామని మంత్రి వేముల అన్నారు. ముందూవెనుక భాగంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక పోర్టికోల ఎత్తు 42 అడుగులు. కుతుబ్‌మినార్ కన్నా ఎత్తైన మన సచివాలయంలో ఆరో



అంతస్తులో 28 అడుగుల ఎత్తైన రెండు హాళ్లను నిర్మించారు. ప్రత్యేక అతిథులు, విదేశీ ప్రతినిధులతో సమావేశాలు, విందుల కోసం వీటిని ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. లోవర్ ఫ్లోర్, గ్రౌండ్ ఫ్లోర్ తరువాత ఆరు అంతస్తులు కాగా, ప్రధాన డోమ్‌లు ఉన్నచోట భవనం 11 అంతస్తులుగా ఉంది. ప్రధాన డోమ్‌ల వైశాల్యం 2,500 చదరపు అడుగులు. డోమ్‌ల ఎత్తు 48 అడుగులు కాగా, వయా 50 అడుగులు. మొత్తం భవనంలో 34 డోమ్‌లను నిర్మించారు. సచివాలయానికి ఇరువైపులా మొత్తం 24 లిఫ్టులు ఉండగా, అందులో ఎనిమిది స్కైలాంజ్‌వరకు వెళ్లేలా ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి గోలెన్ సర్టిఫికెట్ పొందిన గౌరవం కూడా మన సచివాలయానికే దక్కిందని తెలిపారు. భవనంలోని హాళ్లు, డోమ్‌లు, స్కైలాంజ్‌లు దేశంలోని ఏ ఇతర సచివాలయానికీ లేవని చెప్పారు. సచివాలయంలో మొత్తం 635 గదులు,

మిగతా... 2లో



## జోక్యం చేసుకోలేం..

- వైఎస్ వివేకా కేసులో కీలక పరిణామం
- సిబిఐ దర్యాప్తులో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు
- ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరణ

**హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజామంటలు):** వైఎస్ వివేకానందరెడ్డి హత్యాకేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ముందస్తు బెయిల్‌పై

మిగతా... 2లో

## పెట్రోల్‌పై ఎక్సైజ్ వ్యాట్...ధరలు
# తగ్గిస్తేనే మేలు

- అప్పుడే సామాన్యులకు దక్కనున్న ఊరట
- ధరల పెరుగుదలకు కళ్లెం వేయగలుగుతాం
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా

**న్యూఢిల్లీ,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** గత ఐదారేళ్లుగా పెట్రో ధరలపై ప్రధాని అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజానికి చమురు కంపెనీలు గనుక ఈ విధంగా ధరలను పెంచినట్టైతే, అది అక్కడితో ఆగిపోదు. మొత్తం ఆర్థిక వ్యవస్థలో అనేక వస్తువుల ధరలు దాని ఫలితంగా పెరుగుతాయి. కాంగ్రెస్ హయాంలో పెట్రో ధరలపై విరుచుకు పడ్డ మోడీ ఇప్పుడా విషయం మరచిపోయినట్లు ఉన్నారు. ధరల పెరుగుదాల, జిఎస్టీపైనా గుజరాత్ సిఎంగా విమర్శలు గుప్పించిన విషయం ప్రజలు ఇంకా మరచిపోలేదు. నిజానికి కేంద్రంపెట్రోల్‌పై ముందుగా ఎక్సైజ్ డ్యూటీ తగ్గించివుంటే బాగుండేది. ఆ తర్వాత వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలకు చెప్పివుంటే మోడీ నిజాయితీగా ఉన్నాడని అనుకునే వారం. మోడీ అధికారంలోకి వచ్చాక లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్



సుంకాన్ని రూ.18 కిపైగా పెంచారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా పదేపదే చెబుతూనే వచ్చారు. పీఏ హయాంలో లీటర్ పెట్రోల్‌పై రూ.9.84 ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. మోడీ దాన్ని రూ.27.90కు, లీటర్ డీజిల్‌పై రూ.3.56గా ఉన్న సుంకాన్ని రూ.21.80కు పెంచారు. వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలను కోరే ముందు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి చిత్తశుద్ధి చాటుకుంటే

మిగతా... 2లో

## షిర్డి ఆలయానికి
# కేంద్ర బలగాలతో భద్రత

- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు
- కేంద్ర నిర్ణయంపై 1 నుంచి నిరవధిక బంద్

**షిరిడి,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** మహారాష్ట్రలోని ప్రఖ్యాత పర్యాటక ప్రదేశం షిర్డీ లో మే 1నుంచి నిరవధికంగా బంద్ చేయనున్నారు. సాయిబాబా ఆలయాన్ని సంరక్షించేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌ని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినం దుకు నిరసనగా ఆలయ నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆలయ భద్రతా అవసరాలను నిర్వహించడానికి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అవసరం లేదని సాయిబాబా ఆలయ నిర్వాహకులు విశ్వసిస్తున్నారు. షిర్డీ పట్టణంలోని సాయిబాబా ఆలయం అత్యంత ముఖ్యమైన ఆలయం. ఈ చిన్న పట్టణం ఒక ప్రసిద్ధ పర్యాటక కేంద్రం, ప్రపంచవ్యాప్తంగా అన్నీ మతాల వారు ఏటా మిలియన్ల మంది ప్రజలను ఆకర్షిస్తుంది. ప్రాథమిక ఆలయం అహ్మద్‌నగర్-మన్మాడ్ రహదారిపై ఉంది. దీనిని శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ నిర్వహిస్తుంది. 2018లో షిర్డీ విమానాశ్రయం భద్రతా వ్యవహారాలను సిఐఎస్ఎఫ్‌కి అప్పగించారు. ఇప్పుడు సాయిబాబా ఆలయాన్ని రక్షించడానికి ప్రభుత్వం కేంద్ర



బలగాలను కేటాయించాలని యోచిస్తోంది. భద్రతను ఉమ్మడిగా వ్యతిరేకిస్తున్న వివిధ సంస్థలు .. ఇక్కడ అన్ని మార్కెట్‌లు, రవాణాదారులు, వాణిజ్య మరియు ఆతిథ్య పరిశ్రమల మూసివేతకు పిలుపునిచ్చాయి. పట్టణ ప్రజల సమ్మెతో శ్రీ

మిగతా... 2లో



## మణిపూర్‌లో హై అలర్ట్

- మణిపూర్‌లో హై అలర్ట్ ప్రకటించిన ప్రభుత్వం
- 144 సెక్షన్ విధించి నిషేధాజ్ఞలు అమలు

**ఇంఫాల్,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** మణిపూర్‌లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. సెక్షన్ 144 సెక్షన్ ను విధించడంతో పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపి వేసింది. ఏప్రిల్ 28న చురాచాంద్ పుర్‌లో సీఎం బీరెన్ సింగ్ పర్యటించాల్సి ఉండగా ఆయన సభకు నిప్పు పెట్టడం కలకలం సృష్టిస్తోంది. అనూహ్యంగా ఆయన పాల్గొనే సభను, సభావేదికకు గురువారం సాయంత్రం నిరసన కారులు నిప్పు పెట్టారు. దీంతో అప్రమత్తమైని ప్రభుత్వం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చురచంద్ పూర్ జిల్లాలో 144 సెక్షన్‌తో పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపి వేసింది. మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం చిత్తడి నేలలతో పాటు రిజర్వ్, రక్షిత ప్రాంతాలను సర్వే చేయడం ప్రారంభించింది.

మిగతా... 2లో

### ప్రజానాడి






## జనగామలో భట్టి పాదయాత్రలో ఉద్రిక్తత

- పోటాపోటీగా నినాదాలు చేసుకున్న పొన్నాల, కొమ్మూరి

**వరంగల్, ఏప్రిల్ 28, (ప్రజా మంటలు):** జనగామలో కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మాజీ మంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేత పొన్నాల

మిగతా... 2లో



## రాష్ట్రంలో అవినీతిపై కెసిఆర్
# నోరు మెదపాలి

- దళితబంధుపై హైకోర్టు సుమోటో కేసుగా తీసుకోవాలి
- మీడియాతో ఎమ్మెల్యే రఘునందన్ రావు

**హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** రాష్ట్రంలో జరుగుతోన్న అవినీతిపై సీఎం కేసీఆర్ మాట్లాడాలని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి చిట్టా ఉందని ..దళిత బంధులో ప్రజాప్రతినిధులు 3 లక్షల నుంచి

మిగతా... 2లో

## తప్పు చేసిన ఎమ్మెల్యేలపై...
# చర్యలేవీ..?

- దళితబంధుపై హెచ్చరికలు కాదు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ షర్మిల

**హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** తప్పు చేస్తే తన బిడ్డయినా, కొడుకైనా వదిలిపెట్టేది లేదు.. జైలుకు పంపుడే అన్న కేసీఆర్....బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎందుకు వదిలిపెడుతున్నారని వైఎస్ఆర్టీపీ అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలు అవినీతి చేస్తున్నారని కేసీఆరే ఒప్పుకున్నారని.. దళిత బంధులో రూ.3 లక్షల లంచం తీసుకుంటున్నారని చెప్పినట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అవినీతి చిట్టా ఉందని చెప్తున్న

మిగతా... 2లో



# జోక్యం చేసుకోలేం..

**మొదటిపేజీ తరువాయి..**

ఇవాళ వాదనలు వినిపించినా తీర్పు ఇవ్వడం కుదరదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ఇప్పటికిప్పుడు వాదనలు వినాలంటూ.. కోర్టు మీద ఒత్తిడి చేయొద్దని కూడా హైకోర్టు తెలిపింది. 29నుంచి హైకోర్టుకు సెలవులు కావడంతో వెకేషన్ తర్వాతే తీర్పు ఇస్తామని ధర్మాసనం తెలిపింది. అయితే ఈ కేసులో అర్జెన్సీ ఉందని అటు వైఎస్ సునీతారెడ్డి.. ఇటు వైఎస్ అవినాష్ తరపు లాయర్లు కోర్టును కోరారు. బెయిల్ పిటిషన్‌పై తీర్పు అన్ని రోజులు రిజర్వ్‌లో పెట్టడం బాగుండదని.. అత్యవసరమైతే చీఫ్ కోర్టును అభ్యర్థించాలని హైకోర్టు సూచించింది. అంతేకాదు.. కేసును వెకేషన్ బెంచ్‌కు మార్చుకోవచ్చని హైకోర్టు ఇరు పక్షాలకు సూచించింది. సీజే ఎదుట మెన్షన్ చేసి ఆజర్గెన్సీ ఉందని చెబితే.. ఆయన నిర్ణయం తీసుకుంటారని హైకోర్టు తెలిపింది. సీబీఐ తన పని తాను చేసుకోవచ్చా అని దర్యాప్తు సంస్థ తరపు న్యాయవాది న్యాయస్థానాన్ని అడిగారు. ఈ వ్యవహారంలో తాము కలుగ జేసుకోలేమని న్యాయస్థానం తేల్చిచెప్పింది. దీంతో హైకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లయ్యింది. సుప్రీంకోర్టు డైరెక్షన్ స్పష్టంగా ఉన్నాయని తెలిపిన న్యాయస్థానం.. సీబీఐ విచారణ చేసుకోవచ్చని చెప్పింది. ఈ పరిస్థితుల్లో ముందోస్తు బెయిల్ ఇవ్వలేమని మరోసారి న్యాయస్థానం తెలిపింది. బెయిల్ పిటిషన్ తేలేవరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆపాలని కోరిన పిటిషనర్ కోరగా.. సుప్రీంకోర్టు ఉత్వర్వులు నేపథ్యంలో మేము కలుగజేసుకోలేమని హైకోర్టు తెలిపింది. అనంతరం ఇలా ఇరు వాదనలు విన్న తర్వాత విచారణ జూన్-05కు వాయిదా వేసింది. 2 వారాలైన తదుపరి చర్యలు తీసుకోకుండా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని అవినాష్ తరపు లాయర్లు కోర్టు కోరారు. తదుపరి చర్యలు సీబీఐ తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పేసింది.

మరోవైపు.. సీబీఐ కోర్టుకు వివేకా హత్య కేసు నిందితులు హాజరయ్యారు. నలుగురు నిందితులను కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. సీబీఐ కోర్టుకు ప్రధాన నిందితుడు ఎ1 ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కోర్టుకు హాజరజయ్యారు. దీనిపై తదుపరి విచారణ జూన్- 2కి వాయిదా వేసింది. మరోవైపు.. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు గడువు జూన్ 30 వరకే ఉండటంతో హైకోర్టు సూచన తర్వాత అధికారులు ఏం చేయబోతున్నారనే దానిపై కూడా ఆసక్తి నెలకొంది.

## జనగామలో భట్టి పాదయాత్రలో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి..

లక్ష్మయ్య వర్గీయుల పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఉద్రిక్తతల మధ్యనే భట్టి పాదయాత్ర కొనసాగిస్తున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి భారత్ జోడో యాత్ర సందర్భంగా కొమ్మూరి జనగాంలో పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే.

# ఇంకేన్నాళ్లు.. దర్యాప్తు..?

**మొదటిపేజీ తరువాయి..**

కమిషన్ అనుమతి పొంది ఎన్‌ఓసి తీసుకున్నాడని హైకోర్టుకు తెలిపాడు. ఈ సందర్భంగా సిట్ సమా ధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు.. సిట్ దర్యాప్తు నిదానంగా ఉందని అనిపిస్తుందని వ్యాఖ్యానించింది. టీఎస్పీఎస్సీ కేసులో సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి రిపోర్ట్ రావాల్సి ఉందని ప్రభుత్వ తరపున న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ కేసులో టీఎస్పీఎస్సీలో ఉన్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది అందరిని విచారిచారా అని హైకోర్టు ప్రశ్నించింది. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలో ఏ-16 ప్రశాంత్ రోల్ ఏంటని హైకోర్టు ప్రశ్నించింది. ప్రశాంత్ రాజశేఖర్ బావ అని..అతను న్యూజీలాండ్ నుంచి వచ్చి పరీక్ష రాసి వెళ్ళాడని ప్రభుత్వ న్యాయవాది తెలిపాడు. డబ్బులు పెట్టి పేపర్ కొన్న వాళ్ళు మళ్ళీ ఎవరికైనా అమ్మారా అని హైకోర్టు ప్రశ్నించింది. ఈ కేసులో తదుపరి విచారణ జూన్ 5 కు వాయిదా వేసింది. కేసు దర్యాప్తును ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. విచారణపై స్టేటస్ రిపోర్టు జూన్ 5 లోపు సమర్పించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సిట్ దర్యాప్తుపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దర్యాప్తు వేగవంతం చేయాలని సిట్‌కు సూచించింది.

# మణిపూర్‌లో హై అలర్ట్

**మొదటిపేజీ తరువాయి..**

దీనిని అక్కడి ఆదివాసీ గిరిజనులు వ్యతిరేకిస్తూ కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళనలను ప్రభుత్వం అణగదొక్కుతోంది. ప్రభుత్వం ప్రార్థనా స్థలాలను కూల్చేస్తోందని గిరిజన నాయకులు ఆరోపించారు. సీఎం తీరుపై ఆగ్రహంగా ఉన్నా గిరిజనలు సమయం కోసం వేచి చూశారు. ఈ క్రమంలోనే సీఎం బీరెన్ సింగ్ చురాచాంద్ పూర్ జిల్లాలో కొత్తగా నిర్మించిన జిమ్ క్రీడా వసతిని ప్రారంభించాల్సి ఉంది. ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సీఎంపై ఆగ్రహంగా ఉన్న గిరిజనలు ఇదే అదునుగా కొత్త గ్రౌండ్ లోని కుర్చీలను, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. దీంతో సీఎం సభా వేదిక కూడా దగ్ధమైంది.

## ఘనంగా ప్రారంభోత్సవ ఏర్పాట్లు

### డిజిపితో కలిసి సచివాలయాన్ని పరిశీలించిన మంత్రి వేముల

హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజా మంటలు): రాష్ట్ర గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసేలా నిర్మించిన నూతన సచివాలయం ప్రారంభానికి



సర్వం సిద్ధమైంది. ఈ నెల 30న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. అదేరోజు నుంచి కొత్త సచివాలయంలో పాలన సాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంత్రి ప్రశాంత్ రెడ్డి, డీజీపీ అంజనీ కుమార్, సీపీ సీవీ ఆనంద్ పరిశీలించారు.

నిర్వాహకులకు పలు సలహాలు సూచనలు చేశారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసేలా నిర్మించిన నూతన సచివాలయం నిర్మాణం జరిగిందని అన్నారు. ఈ నెల 30న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానుందన్నారు. అదేరోజు నుంచి కొత్త సచివాలయంలో పాలన సాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# పెట్రోల్‌పై ఎక్సైజ్ వ్యాట్...ధరలు తగ్గిస్తేనే మేలు

**మొదటిపేజీ తరువాయి..**

బాగుండేది. ఇదిలా ఉంటే సెంట్రల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో లక్షల కోట్లు ఆదాయం వస్తున్న విషయాన్ని ప్రధాని ప్రజలకు చెప్పడం లేదు. ఎక్సైజ్ సుంకం ద్వారా కేంద్రానికి రూ.26 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన విషయాన్ని ప్రధాని ఎక్కడా ప్రస్తావించడంలేదు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాల వాటాను సకాలంలో చెల్లించడం లేదు. కేందరం ఎక్సైజ్ సుంకాన్ని..ఆ తర్వాత రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలి. అప్పుడే పెట్రో ధరలు తగ్గి రవాణా ఛార్జీలు తగ్గుతాయి. దీంతో సరకు రావాణా భారం కూడా తగ్గుతుంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, అక్కడి ప్రభుత్వాలు విలువ ఆధారిత పన్ను(వ్యాట్) తగ్గించకపోవడమే ఇందుకు కారణమని బిజెపి నేతలు నీతులు వల్లిస్తున్నారు. ఓ రకంగా పెట్రో ధరలపై రాష్ట్రాలను అప్రతిష్టపాలు చేయాలన్న ఆలోచన తప్ప నిర్మాణాత్మక ఆలోచన మాత్రం చేయడం లేదు. సామాన్య ప్రజలకు ఊరట కలిగించడానికి, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ,వ్యాట్ తగ్గించాల్సిందే. అప్పుడు ప్రభుత్వం కూడా తన వ్యయాన్ని ఆ మేరకు పెంచవలసి వుంటుంది. ఆ విధంగా అదనపు వ్యయం చేయాలంటే అందుకోసం ప్రభుత్వం తన ఆదాయా న్నీ పెంచుకోవాలి, అందుకు ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల మీద తనకు వచ్చే పన్ను ఆదాయాన్ని పెంచు కోవాలి. ప్రభుత్వం మాదిరిగానే పెట్రో ఉత్పత్తులను వినియోగించే ప్రతీ సంస్థ ఆర్‌టిసి, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలువంటివి కూడా తమ సేవల రేట్లు పెంచవలసి వుంటుంది. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి. ఇంతటితోనే ఇది ఆగదని, రాబోయే రోజుల్లో ఇదే విధమైన వడ్డింపులు మరిన్ని రానున్నా యని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అటు కంపెనీలూ చమురు పెరుగుదల భారాన్ని భరించడానికి సిద్ధంగా లేవు. ఇటు ప్రభుత్వమూ పెరిగే ధరల ద్వారా తనకు లభించే అదనపు ఆదాయాన్ని వదులు కోడానికి సిద్ధంగా లేదు. భారమంతా వినియోగదారులపైనే పడేయడం ద్వారాచేతులు దులుపుకోవాలన్న ధోరణిలో పాలకులు ఉన్నారు.

# రాష్ట్రంలో అవినీతిపై కెసిఆర్ నోరు మెదపాలి

**మొదటిపేజీ తరువాయి..**

5 లక్షల వరకు తీసుకుంటున్నారని స్వయంగా కేసీఆరే చెప్పారని.. దీన్ని హైకోర్టు సుమోటోగా తీసుకోవాలని కోరారు. హైకోర్టు సుమోటోగా తీసుకుని సీఎం కేసీఆర్‌కు నోటీసులివ్వాలన్నారు. దళిత బంధులో అవినీతికి పాల్పడుతోన్న వారిపై చర్యలు తీసుకోకుండా.. తప్పు చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలను కేసీఆర్ వెనకేస్తున్నారని విమర్శించారు రఘునందన్ రావు. దళితబంధులో జరుగుతోన్న అవినీతిపై సీఎం కేసీఆర్ హైకోర్టుకు లేఖ రాయాలని లేకపోతే ఏసీబీ డీజీకి అవినీతి చిట్టా వివరాలివ్వాలన్నారు రఘునందన్ రావు. ఈ రెండు జరగకపోతే ఏసీబీ డీజీ సీఎం కేసీఆర్ కు నోటీసులివ్వాలన్నారు. ప్రభుత్వంలో అవినీతి జరుగుతుందని తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోని కేసీఆర్ కు ముఖ్యమంత్రి సీటులో కూర్చునే అర్హత లేదని విమర్శించారు. ఊర్లలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రభుత్వం అమ్ముకుంటోందని రఘునందన్ రావు ఆరోపించారు.తప్పు చేస్తే తనయుడైనా.. తనయ అయినా శిక్షిస్తానన్న కేసీఆర్ ఇవాళ ఒక సీనియర్ మంత్రిపై ఆరోపణలు వస్తే ఎందుకు స్పందించ రో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి రాజయ్యపై ఎలాంటి ఆరోపణలు రుజువు చేయకుండానే క్యాబినెట్ నుంచి ఎలా తొలగించారో.. బీసీ మంత్రి ఈటల రాజేందర్ ను ఎలా తొలగించారో... మంత్రి నిరంజన్ రెడ్డిపై అదే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక మంత్రిపై అన్ని ఆధారాలతో ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడితే కేసీఆర్ ఎందుకు స్పందించరని రఘునందన్ రావు ప్రశ్నించారు. ధరణిలో లోపాలున్నాయని రైతులు ఇబ్బందులు పడుతున్నారని హైకోర్టు తప్పుబట్టినా మార్పులు చేయడం లేదన్నారు. ప్రభుత్వం పేద రైతుల భూములను అప్పనంగా అమ్ముకుంటుందన్నారు. డబుల్ బెడ్రూంలో అవినీతి, ధరణిలో అవినీతి, మిషన్ కాకతీయలో అవినీతి, దళితబంధులోనూ.. ఇలా ప్రభుత్వ పథకాలన్నింటిలో దోపిడి జరుగుతోందనన్నారు.

# షిర్డి ఆలయానికి కేంద్ర బలగాలతో భద్రత

**మొదటిపేజీ తరువాయి..**

సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌కి ఎలాంటి సంబంధం లేదని ఆలయ



అధికారి ఒకరుతెలిపారు. కానీ సాయిబాబా ఆలయంలో కార్యకలాపాలన్నీ యథావిధిగా పనిచేస్తాయి... కేంద్ర బలగాలు ఎప్పుడు మోహరిస్తాయో తెలియదని.. ప్రస్తుతం మహారాష్ట్ర పోలీసులు ఇక్కడ భద్రత కల్పిస్తున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మెటల్ డిటెక్టర్లు, ఇతర భద్రతా ఏర్పాట్లు ఆలయ ప్రాంగణంలో ఉన్నాయని ట్రస్ట్ అధికారులు తెలిపారు. ప్రధాన సాయిబాబా ఆలయం 4.5 ఎకరాలలో విస్తరించి... కార్యకలాపాలు దాదాపు 350 ఎకరాలలో ఉన్నాయి. అయినప్పటికీ భద్రత పర్యవేక్షణ ఆలయ ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయబడుతుంది.

షిర్డీ పట్టణంలో దాదాపు 25,000 మంది జనాభా ఉన్నారు. సాయిబాబా ఆలయాన్ని ప్రతిరోజూ 50,000 మంది భక్తులు సందర్శిస్తారు. షిర్డీ వంటి మతపరమైన పుణ్యక్షేత్రం ప్రత్యేక భద్రతా సవాళ్లను నిర్వహించడానికి నైపుణ్యం లేని ప్రత్యేక దళం అవసరం లేదని పట్టణ ప్రజలు వాదించారు. ఈ షట్‌డౌన్ స్థానిక ఆర్థిక వ్యవస్థపై పెద్ద దెబ్బ పడుతుంది. ఇది దాని మనుగడ కోసం పూర్తిగా మతపరమైన పర్యాటకంపై ఆధారపడి ఉంటుంది. ఏదేమైనప్పటికీ, ఆలయ నిర్వాహకులు ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. మతపరమైన పుణ్యక్షేత్రం కాబట్టి విలక్షణమైన భద్రతా పర్యవేక్షణకు కేంద్ర బలగాలు అవసరం లేదని ఆలయ నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీ సాయి బాబా సంస్థాన్ ట్రస్ట్ ఆలయ ప్రాంగణ నిర్వహణను పర్యవేక్షిస్తుంది, ఇందులో ఉచిత భోజనం, వసతి, ఇతర సౌకర్యాలు, స్వచ్ఛంద పాఠశాలలు , కళాశాలలను నిర్వహించడం వంటివి ఉంటాయి.

# తెలంగాణ రాజసం.. కొత్త పాలనా సౌధం

30 కాన్ఫరెన్స్ హాళ్లను నిర్మించాం. మంత్రులందరికీ ప్రత్యేక చాంబర్లతోపాటు కాన్ఫరెన్స్ హాళ్లను ఏర్పాటు చేశారు. విధుల్లో జాప్యం జరుగకుండా అన్నీ ఒకేచోట ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సమీకృత సచివాలయ నిర్మాణాన్ని చేపట్టారు. మంత్రులు, కార్యదర్శులు, సిబ్బంది ఒకేచోట ఉన్న సచివాలయం దేశంలో ఇదే మొదటిది. గతంలో ఒక్కొక్కరు ఒక్కో కార్యాలయంలో ఉండటంతో విధి నిర్వహణ, ఫైళ్ల మూవ్‌మెంట్‌లో తీవ్ర జాప్యం



జరిగేది. ఇక్కడ ప్లగ్ అండ్ ప్లే వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఉద్యోగులకు అవసరమైన సకల సౌకర్యాలు ఇందులో ఉంటాయి. సచివాలయానికి పునాదిరాయి వేసిననాడే సీఎం కేసీఆర్ నాతోపాటు అధికారులను పిలిచి భవనానికి అవసరమైన సామగ్రిని ముందే కొనుగోలు చేయాలని, ఎటువంటి జాప్యం చేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీంతో 20 నెలల్లోనే భవన నిర్మాణం పూర్తయింది. వాస్తవానికి పునాదిరాయి పడినప్పటినుంచి ఈ ఏడాది ఏప్రిల్ మాసాంతానికి 26 నెలలు అవుతుంది. ఇందులో కొవిడ్ కారణంగా మూడు నెలలు, కొవిడ్ వల్ల సొంత ఊళ్లకు వెళ్లిపోయిన కార్మికులు తిరిగి విధుల్లో చేరేందుకు మరో మూడు నెలల సమయం పట్టింది. ఇలా ఆరు నెలలు వృథా అయింది. మొత్తం 10 లక్షల చదరపు అడుగుల భవన నిర్మాణాన్ని 20 నెలల్లో పూర్తిచేయడం రికార్డుగా చెప్పవచ్చు. ఏసీల ఏర్పాటుకు ఆరు నెలలు పట్టింది. ప్రధాన పిల్లర్లు, గుమ్మటాలకు ముందుగా పోతపోసిన నిర్మాణాల జీఆర్‌సీ పనులు కూడా బాగానే సమయం తీసుకున్నాయి. రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ మైన్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన రెడ్ శాండ్‌స్టోన్‌ను వాడారు. ముందుగా రాజస్థాన్‌లోని ఓ మైన్‌నుంచి ఈ రాయిని తెప్పించేందుకు ఒప్పందం చేసుకోగా, అదే మైన్ నుంచి పార్లమెంటు నిర్మాణానికి కూడా రెడ్ శాండ్ స్టోన్‌ను కొనుగోలు చేశారు. దీంతో మన సచివాలయం కోసం మరో మైన్ నుంచి కొనుగోలు చేయాల్సి వచ్చింది. సచివాలయ నిర్మాణంలో 3500 క్యూబిక్ మీటర్ల రెడ్ శాండ్ స్టోన్‌ను 1000 లారీల ద్వారా ఇక్కడికి తరలించారు. చివాలయంలో రిసెప్షన్ హాలు, మీడియా హాలు, రెండు బ్యాంకులు, రెండు ఏటీఎంలు, బస్ కౌంటర్, రైల్వే కౌంటర్, క్యాంటీన్, అసోసియేషన్ బిల్డింగ్, డిస్పెన్సరీ, మసీదు, దేవాలయం, చర్చి తదితరమైనవి ఉన్నాయి. 300 సీసీ కెమేరాలను ఏర్పాటుచేయడంతోపాటు రెండు షిఫ్టుల్లో పనిచేసేందుకు 300 మంది సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తున్నాము. ఈ సీసీ కెమేరాలను అనుసంధానం చేస్తూ ఐదో అంతస్తులో ఓ కమాండ్



కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటుచేశారు. విద్యుత్ వాడకాన్ని తగ్గించేందుకు పార్కింగ్ స్థలంలో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటుచేస్తున్నారు. మొత్తం 28 ఎకరాల స్థలంలో కేవలం రెండున్నర ఎకరాల్లో మాత్రమే నిర్మాణాలు చేసి, మిగిలిన స్థలాన్ని పచ్చదనం, పార్కింగ్, రోడ్ల కోసం వినియోగిం చడం విశేషం అన్నారు. సచివాలయానికి నాలుగువైపులా నాలుగు ద్వారాలు ఉన్నాయి. ఇందు లో తూర్పు వైపు నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ తదిత రులు వెళ్లవచ్చు. పశ్చిమం వైపు ఏర్పాటుచేసిన ద్వారాన్ని అత్యవసర సమయాల్లో మాత్రమే ఉపయోగిం చాలని నిర్ణయించారు. ఈశాన్యంలోని ద్వారం గుండా అధికారులు, ఉద్యోగులు వెళ్తారు. వారికి పార్కింగ్ కూడా అక్కడే ఉంది. ఆగ్నేయ ద్వారాన్ని సందర్శకులకు ప్రత్యేకించారు. వారికి ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం, పాసులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 617 కోట్లు మంజూరుచేసిన విషయం తెలిసిందే. అయితే నిర్మాణ వ్యయం 20-30 శాతం వరకూ పెరుగు తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. భవనం నిర్వహణకుగాను ప్రతి చదరపు అడుగుకు సుమారు రూ. 10 చొప్పున మొత్తం 10 లక్షల చదరపు అడుగులకు నెలకు రూ. కోటి వరకూ మెయింటెనెన్స్ ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ భవనం తెలంగాణలో అద్భుత కట్టడగా నిలుస్తుందని మంత్రి వేముల వివరించారు.



## తప్పు చేసిన ఎమ్మెల్యేలపై...

# చర్యలేవీ..?

**మొదటిపేజీ తరువాయి..**

కేసీఆర్..వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. అవినీతికి పాల్పడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించడం లేదని షర్మిల ప్రశ్నించారు. ఎవరో అనామకుడు ఫిర్యాదు చేస్తే వెనకాముందు ఆలోచించకుండా మంత్రిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారని... ఆ అనామకుడికున్న విలువ కేసీఆర్ కు లేదా అని నిలదీశారు. కేసీఆర్ దగ్గర అవినీతి చిట్టా ఉన్నా...చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. లిక్కర్ స్కామ్లోనీ బిడ్డ మీద ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తారనే కదా.. ఎమ్మెల్యేలు అవినీతి చేస్తున్నా కండ్లు తుడుచుకొని చేతకాని దద్దమ్మలా చూస్తున్నావ్ అని కేసీఆర్ పై షర్మిల ఘాటు వ్యాఖ్యలు చేశారు. నీ బంగారు బతుకమ్మే బాగా లేనప్పుడు.. ఇతరులను శిక్షించే అర్హత నీకెక్కడిదని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వానికి పాలించే స్థాయి లేదని... అవినీతి పాలనలో మునిగి తేలిన కేసీఆర్ ప్రభుత్వానికి..బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెడుతారని స్పష్టం చేశారు.

### ప్రజలను మభ్య పెట్టడానికే

# వందసీట్ల మంత్రం

**మొదటిపేజీ తరువాయి..**

ఆ పార్టీ ఏం చేసిందో, ఏం చేయబోతుందో చెప్పుకోలేక పోయిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలకే ఏమీ చేయలేని ముఖ్యమంత్రి దేశానికి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కాకపోతే.. అంతర్జాతీయ రాష్ట్ర సమితి పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తెరాస పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టడానికి, భాజపాను విమర్శించడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ప్లీనరీ సమావేశాలు నిర్వహించిందని సంజయ్ విమర్శించారు. 9ఏళ్ల పాలనలో తెరాస ఏం చేసిందో, భవిష్యత్తులో ఏం చేయబోతుందో చెప్పకుండా భాజపా లక్ష్యంగానే ప్లీనరీ సమావేశాలు నడిచాయని అన్నారు. రాష్ట్రంలో తెరాస పతనం ప్రారంభమైందని అభిప్రాయపడ్డారు. ప్లీనరీ తీర్మానాలు చూసి తెరాస నేతలే నవ్వుకుంటు న్నారని, ఆ తీర్మానాల వల్ల రాష్ట్రానికి, దేశానికి ఎలాంటి ప్రయోజనం లేదని అభిప్రాయపడ్డారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేసిన కేసీయార్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను అప్పులపాలు చేసిందినిజం కాదా అని ప్రశ్నించారు. మోడి విధానాల్ని ఇతర దేశాల అధినేతలు ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఈఎస్ఐ, సహారా కుంభకోణాలు వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. భాజపా మతతత్వ పార్టీ అన్న కేసీఆర్ విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. దేశానికే ఎంఐఎం పార్టీ క్యాన్సర్ లాంటిదని, అలాంటి క్యాన్సర్ గొంతులో వేసుకున్నది ముఖ్యమంత్రేనని ఎదురుదాడికి దిగారు. ఎంఐఎం మతపార్టీ కాదా అని ప్రశ్నించారు. అవకాశమిస్తే కేసీఆర్ ముస్లింలకు 20శాతం రిజర్వేషన్లు కూడా అమలు చేస్తారని విమర్శించారు. కాంగ్రెస్- తెరాస ఒకటేనన్న సంజయ్.. కాదని చెప్పినా జనం నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. భాజపాను ఒంటరిగా ఎదుర్కోలేక భాజపాయేతర పక్షాలు ఒక్కటవుతున్నాయని, ఎన్ని కూటములు ఏర్పడినా..తెలంగాణలో భాజపాదే అధికారమని స్పష్టం చేశారు. మహిళా గవర్నర్‌కు రాష్ట్రంలో కనీస గౌరవం దక్కడం లేదన్నారు. తెరాస పాలనలో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని, రజాకార్ల సమయంలోని ఆఘాయిత్యాలు తెరాస పాలనలో చూస్తున్నామన్నారు. కేంద్రంలో 27 మంది బీసీలకు మోదీ మంత్రి పదవులిచ్చారని, ప్రధాని మోదీ, తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు బీసీలని తెరాస పాలనలో బీసీలకు ఎన్ని మంత్రి పదవులు దక్కాయో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఆయా గ్రామాలు అభివృద్ధి చెందాయని, అవార్డులు పొందాయని గుర్తు చేశారు. రూ.4 లక్షల కోట్ల అప్పులున్న తెలంగాణ ధనిక రాష్ట్రమా. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి కేసీఆర్ కుటుంబం సంపాదించు కుందని బండి సంజయ్ విమర్శించారు.

# పెట్టుబడులకు అనుకూల వాతావరణం

**- మంత్రి కేటీఆర్**



హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజామంటలు): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణలో పెట్టుబడులు అనేకులు ఆకర్శితులై వస్తున్నారని అన్నారు. 2030 లోపు లైఫ్ సైన్సెస్ రంగంలో 100 బిలియన్ డాలర్ల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్‌లో డేటా సైన్స్ కలుస్తుందన్నారు. పరిశోధన కేంద్రాల విషయంలో ఆసియాలోనే క్రియాశీలక స్థానంలో ఉన్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. నైపుణ్యం, సామర్థ్యం విషయంలోనూ హైదరాబాద్‌ది ప్రత్యేక స్థానమని చెప్పారు. నగరంలో ఇప్పటికే ఐడీపీఎల్, ఇక్రిశాట్, సీఎస్ఐఆర్ వంటి ఎన్నో పరిశోధన కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్లోబల్ కేపబిలిటి సెంటర్లకు కూడా హైదరాబాద్ మంచి ప్రదేశమని వెల్లడించారు.

## ఒకేరోజు మూడు పరీక్షల

# నిర్వహణ తగదు

### బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజా మంటలు): తెలంగాణ ప్రభుత్వంపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. టీఎస్ పీఎస్ సీ పరీక్షల నిర్వహణను తప్పుబట్టారు. ఒకే రోజు మూడు పరీక్షలు నిర్వహించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక అభ్యర్థి ఒకే రోజు మూడు నాలుగు పరీక్షలు ఎట్ల రాస్తాడని ప్రశ్నించారు. ఏప్రిల్ 30న విద్యుత్ సంస్థలో లైన్ మెన్ పరీక్ష ఉంది. ఇది కాకుండా మరో రెండు పరీక్షలు అదే రోజున జరుగుతు న్నాయి. మూడు పరీక్షలు రాయాలనుకున్న అభ్యర్థి ఒకేసారి ఎలా రాస్తారని ప్రశ్నించారు.అభ్యర్థులు నష్టపోతారని.. పరీక్షల తేదీలను మార్చాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని ఒకే రోజు ఒకే పరీక్ష పెట్టాలని కోరారు. మిగతా పరీక్షలను వేరే తేదీల్లో నిర్వహించాలని కోరారు. పరీక్షల తేదీలను మార్చకుండా ప్రభుత్వం మొండిగా వెళ్తే బీఆర్ఎస్ పార్టీ నేతలను తెలంగాణ ఊర్లలో తిరగనియ్యబోమని ప్రవీణ్ కుమార్ వార్నింగ్ హెచ్చరించారు. పార్టీని బరాబర్ బొందపెట్టామని అన్నారు.



## మూడవ వార్డులో సీసీ రోడ్డు ప్రారంభం

**జనగామ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలోని బాలాజీ నగర్ మూడవ వార్డు ఎల్లమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు ను కౌన్సిలర్ పగిడిపాటి సుధా సుగుణాకర్ రాజు శంఖుస్థాపన పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు.



ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ వార్డు అభివృద్ధి కోసం పాటు పడుతున్నామని, ఎం.ఎల్.సి. ఫండ్ ద్వారా రోడ్డు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.యం.వో. డాక్టర్ పి. సుగుణాకర్ రాజు, కాలనీ వాసులు దూడల రమేష్, పోగుల జయపాల్ రెడ్డి, అంజాజీ, రంగు సుధాకర్ గౌడ్, గట్టు బిక్షపతి, గోనె యాదగిరి, కాంట్రాక్టర్ దోర్నాల శశికాంత్, మున్సిపాలిటీ ఎఈ, వెంకటరత్నం, సూపర్ వైజర్ సురేష్, దూడల శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్యాధికార భరోసా నిధి సేకరణ

**స్టేషన్ ఘన్‌పూర్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** బహుజన రాజ్యాధికార భరోసా నిధి కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం స్టేషన్ ఘన్‌పూర్ లో నిధి సేకరణకు విశేష స్పందన వస్తుందని బి.ఎస్.పి. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ డా. తాళ్లపల్లి వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన నిధి





సేకరణ వివరాలు వివరించారు. మే 07న తెలంగాణ భరోసా సభకు భావి భారత ప్రధాని బెహన్ జీ కుమారి మాయావతి, తెలంగాణ రాష్ట్ర బహుజన ఉద్యమ రథసారథి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విచ్చేయుచున్నారని, స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గం నుండి 2000 మందిని తరలించడానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని సమకూరుస్తున్నామని అన్నారు. బహుజన వ్యాపారి చింత దేవదాస్ (జీవ జలం ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ), ఆటో యూనియన్ తమ్మడపల్లి. ఐ. గ్రామ అధ్యక్షులు రడపాక ఆదాము నేడు నిధికి సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు మోకినపల్లి చక్రపాణి, జిల్లా సీనియర్ నాయకులు నల్ల రమేష్ , నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జిడి యాకోబు గారు, బీవీఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ నీరటి దీపక్ రాజ్, ఎస్.ఎస్.యు. జిల్లా ఇన్చార్జ్ మాదారపు విజయ్ పాల్గొన్నారు.

## జూనియర్ పంచాయితీ సెక్రటరీల నిరవధిక సమ్మె

**రాయికల్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** రాయికల్ మండలం పరిషత్ కార్యాలయంలో ఆవరణలో జూనియర్ పంచాయితీ సెక్రటరీ లు శుక్రవారం సమ్మె




నిర్వహించారు...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జూ. పంచాయతీ కార్యదర్శుల పోస్టులను రెగ్యులర్ చెయ్యకుండా వ్యవహరించడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నరేష్, కవిత, వెంకటేష్, రాజేష్, మహేష్, వెంకటాచలం, అశోక్, దేవదాస్, కవిత, గీతా రాణి, అపర్ణ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన ధూప దీప నైవేద్య సంఘ కార్యవర్గ ఎన్నికలు

**జగిత్యాల ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జిల్లా నూతన దూప దీప నైవేద్య సంఘ కార్యవర్గాన్ని నేడు జగిత్యాల అంగడి దగ్గర ఉన్న శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా శ్రీ సేనాపతి ప్రవీణ్ కుమార్ ఆచార్య అధ్యక్షులుగా నాగరాజు మహేంద్ర చారి ప్రధాన కార్యదర్శిగా అలువాల ఆత్మరామ్ శర్మ కోశాధికారిగా చెరుకు శ్యాంసుందర్ శర్మ మరియు సహాయ కార్యదర్శిగ దేశు



ముఖ్ ఫణీంద్ర శర్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అర్చక వెల్ఫేర్ నెంబర్ శ్రీ జక్కాపురం నారాయణ స్వామి మాజీ రాష్ట్ర ధూప దీప నైవేద్య సంఘ అధ్యక్షులు వేటూరి ఆంజనేయ చారి పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జక్కాపురం నారాయణ స్వామి మాట్లాడుతూ రాబోయే కొన్ని రోజుల్లో అర్చకుల యొక్క వేతనాలు పెంపు ఆరోగ్య భద్రత సంబంధించిన కార్డ్స్ అందజేయడం జరుగుతుందని తెలపడం జరిగింది. గౌరవాధ్యక్షులు మాట్లాడుతూ సంఘం బలోపేతంగా ఉండాలంటే అర్చకులు అందరూ ఏకతాటి పైన ఉండాలని అలాంటప్పుడే మన యొక్క సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలియజేయడం జరిగింది.

## ఆధారాలున్నా... దళిత బంధు అవినీతిపరులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

- బడ్జెట్‌లో కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేయాలి
- ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి

**జగిత్యాల ఏప్రిల్ 29 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళిత సమాజం తలదించుకునేలా కేవలం ఆరోపణలకే, ఎటువంటి ఆధారాలు లేకున్నా ఉప ముఖ్యమంత్రి పదవి నుండి తాటికొండ రాజయ్యను సీఎం కెసిఆర్ తొలగించారు.. దళిత బంధు పథకంలో ఒక్కొక్కరి నుండి రు. 2-3 లక్షలు వసూలు చేస్తున్నారని, ఆధారాలు ఉన్నాయని స్వయంగా సీఎం కేసీ ఆరే చెబుతున్నా అవినీతిపరులు, కమిషన్లకు కక్కుర్తి పడిన ప్రజాప్రతినిధుల పై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని నిలదీశారు. దళిత బంధు నా ఆత్మ బందు అంటూ సీఎం కేసీ ఆరే దళిత బంధు పథకాన్ని నీరుగార్చుతున్నారని విమర్శించారు.



**నీకో నీతి..దళిత సమాజానికో నీతియా అని నిలదీశారు.**

తెలంగాణ ఉద్యమ సమయంలో అవినీతి కి ఎవరు పాల్పడినా సహించమన్న సీఎం కెసిఆర్ అవినీతి పరులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 2022-23 బడ్జెట్ లో నియోజక వర్గంలో 3000 చొప్పున స్వంత ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు రు. 3 లక్షల చొప్పున ఇచ్చేందుకు 12,000 కోట్లు కేటాయించిన ఒక్క ఇల్లు కూడా కట్టలేదన్నారు. దళితుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు సుమారు 50 వేల కోట్లతో రు. 10 లక్షల చొప్పున 5 లక్షల ఇళ్లు నిర్మించవచ్చని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. దళితుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులతో ఇళ్లు నిర్మిస్తే ఇళ్లు లేని నిరుపేదలుండరని అన్నారు. బడ్జెట్ లో కేటాయించిన నిధులు వెచ్చించించకుండ దళితులను మభ్యపెడుతున్నారు. అవినీతి పరులపై చర్యలు తీసుకోకపోతే సీఎం కెసిఆర్ బాధ్యత వహించాలన్నారు. నిరుద్యోగ ఖాళీలు భర్తీ చేస్తే వేతనాలు చెల్లించే స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని అన్నారు. సీఎం కెసిఆర్ కు దళితుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రకటనలకే పరిమితం కాకుండా దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన ప్రజా ప్రతినిదులు ఏ స్థాయిలో ఉన్నా చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ధర రమేష్ బాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్ల పెల్లి దుర్గయ్య,వర్తక సంఘం అధ్యక్షుడు కమాటల శ్రీనివాస్, పిసిసి ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్ పాషా, రాధా కిషన్, బొల్లి శేఖర్, మహిపాల్, బీరం రాజేష్ పాల్గొన్నారు.

## జనగామలో "తెలంగాణ భరోసా సభ" గోడ పత్రిక ఆవిష్కరణ

**జనగామ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర "తెలంగాణ భరోసా సభ" గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జనగామ నియోజకవర్గ ఇన్చార్జి జేరిపోతుల కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి నిర్మాల రత్నం పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం 1300 మంది పేద బహుజన విద్యార్థుల త్యాగాలతో ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రాంతంలోని ప్రజలంతా కుల మతాల కచ్చితంగా చిన్న పెద్ద తేడా లేకుండా పోరాడుతుంటే పోలీసుల లాఠీ దెబ్బలు ప్రాణాలను లెక్కచేయకుండా కొట్లాడుతున్న తీరును చూసి ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ జి కుమారి మాయావతిని కలిసి మద్దతు కావాలని కోరితే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారంగా చిన్న రాష్ట్రాలు ఏర్పాటుతో అభివృద్ధి సాధ్యమని నమ్మి బహుజన్ సమాజ్ పార్టీకి చెందిన 36 మంది పార్లమెంట్ సభ్యులతో తెలంగాణకు సహకరించిందన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై కొట్లాడుతూ ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నిస్తూ ఆత్మగౌరవంతో పోరాడుతున్న బహుజన్ సమాజ్ పార్టీ రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ మే నెల 7న హైదరాబాద్ లోని సరూర్ నగర్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. భావి భారత ప్రధాని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి 4 సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాన్సిరాం వారసురాలు బెహెన్ జి. కుమారి మాయావతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ సోమవారపు ఉపేందర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రశేఖర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు



బక్క మారయ్య, పట్టణ ఇన్చార్జి రోడ్డ.సుధాకర్, జనగామ మండల అధ్యక్షుడు మామిడి సుధాకర్, జనగామ మండల ఇన్చార్జి జేరిపోతుల మల్లేష్, తుర్కపల్లి కుమార్, జేరిపోతుల రఘు, చేతల అశోక్, కొంపెల్లి బిక్షపతి, పాలమకుల రమేష్, గద్దం పవన్, ధర్మపురం రాము తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలో జిల్లా మెడికల్ కాలేజీ చుట్టూ నలువైపులా రహదారుల అభివృద్ధిలో భాగంగా చిన్న కెనాల్ నుండి రామాలయం వరకు రోడ్ల నిర్మాణం, బస్ డిపో నుండి మాతా శిశు సంరక్షణ కేంద్రం వరకు బిటి రోడ్డు, నటరాజ్ చౌరస్తా నుండి బసవేశ్వర విగ్రహం వరకు బిటి రోడ్డు,ఐ డి ఓ సి (నూతన కలెక్టరేట్) నుండి అంతర్గాం రోడ్డు వరకు 4 లైన్ల బిటి రోడ్డు (బ్యాలెన్స్ రీచ్) అభివృద్ధి పనుల కోసం 11 కోట్ల 15 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... బడుగు బలహీనర్గాలకు మెడికల్ కాలేజీ,సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ చాలా ఉపయోగం. జిల్లా నడి బొడ్డున 500 కోట్ల తో కళాశాల ఏర్పాటు. ప్రజలకు రవాణా దృష్ట్యా, వసతుల దృష్ట్యా అనువైన ప్రాంతం ఎంపిక చేయటం జరిగింది. త్వరితగతిన పనులు మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. మెడికల్ కళాశాలకు 150 కోట్లు మంజూరు చేయటం జరిగింది. 11 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. సిటీ స్కాన్, డయాగ్నొస్టిక్ కేంద్రం, రేడియాలజీ కేంద్రం ద్వారా ప్రజలకు మరింత ఉపయోగం.





**మెడికల్ హబ్ గా జగిత్యాల జిల్లా కేంద్రం.**

నేటి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి చుట్టూ ప్రక్కల జిల్లాల నుండి సైతం ప్రజలు వస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే యావర్ రోడ్డు వెడల్పులో అడ్డంకులు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు ఓద్ది శ్రీలత రామ్మోహన్ రావు, జుంబర్తి రాజ్ కుమార్,పట్టణ పార్టీ కార్యదర్శి బాయిన్పల్లి ప్రశాంత్ రావు, ఎఫ్‌సిఎస్ డైరక్టర్ ఆరుముళ్ల పవన్, బింగి రాజేశం, వొంటిపులి రాము, రాకేష్, ఉమెందర్, శ్రీనివాస్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది పట్టా పొందిన దడిగ సందీప్

**జనగామ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జనగామ మండలంలోని గానుగుపహాడ్ గ్రామానికి చెందిన దడిగ సందీప్ న్యాయవాదిగా పట్టా పొందారు. సందీప్ చిన్ననాటి నుండే విప్లవ బావాలకు ఆకర్షితుడై విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ లో కీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జనగాం జిల్లా అధ్యక్షునిగా నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎల్.ఎల్.బి పూర్తి చేసి చదువును పక్కదారి పట్టకుండా పోరాట మార్గంలో అనేక సమస్యల స్పందిస్తూనే న్యాయవాదిగా పట్టా పొందడంతో తోటి విద్యార్థులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాది పట్టా పొంది కుటుంబ సభ్యుల్లో సంతోషాన్ని నింపారు. ప్రస్తుతం ఎల్.ఎల్.బి పూర్తయిన అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలోని ఎల్.ఎల్.ఎమ్. విద్యను అభ్యసిస్తున్నారని ఉన్నంత చదువులు చదువుతూ ఇతర విద్యార్థుల కోసం పోరాటాల నిర్వహిస్తున్నారని కొనియాడారు.



## బి.ఎస్.పి. సముద్రాల గ్రామ కమిటీ నియామకం

**స్టేషన్ ఘన్‌పూర్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** బహుజన సమాజ్ పార్టీ (బి.ఎస్.పి) సముద్రాల గ్రామంలో గ్రామ కమిటీ నియమించినట్లు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ తాళ్లపల్లి వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ (బి.ఎస్.పి) సముద్రాల



గ్రామంలో గ్రామ కమిటీ నియామక సదస్సు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జిడి యాకూబ్ అధ్యక్షతన జరగగా, ముఖ్యఅతిథిగా బిఎస్పి సీనియర్ నాయకులు నల్ల రమేష్ పాల్గొని మాట్లాడుతూ.... (బి.ఎస్.పి) పని విధానాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రాజ్యాధికార లక్ష్య సాధన, గురుకులాల విద్యార్థులకు చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రస్తుతం బహుజన రాజ్యాధికార సాధనలో తమవంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. తదుపరి గ్రామ కమిటీని నియమించారు. గ్రామ ఎలక్షన్ బూత్ గౌరవ అధ్యక్షులు చిలువేరు యాకన్న, జలగం ప్రవీణ్, గుండె నాగరాజు, గ్రామ అధ్యక్షులు చెరుపెల్లి రాములు, ఉపాధ్యక్షులు, భాస్కుల రమేష్, ప్రధాన కార్యదర్శి గుండె రమేష్, కోశాధికారి చెరుపెల్లి అరుణ్ కుమార్, కార్యదర్శులు చెరుపెల్లి నాగరాజు, మారపాక రమేష్, చెరుపెల్లి వెంకటేష్ ల నియమించారు.

## మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మె

**గొల్లపల్లి ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగు సంవత్సరాలు ప్రొబేషనరీ కాలం పూర్తయి రెగ్యులరైజేషన్ పై ఎలాంటి ప్రకటన రానందున రాష్ట్రవ్యాప్త జేపీఎస్ ల నిలుపు మేరకు 28 తేదీ నుండి నిరవధిక సమ్మెను గొల్లపల్లి మండలం




ఎంపీడీవో కార్యాలయం ముందు మండలంలోని జెపిఎస్ ఓ పి ఎస్ 25 మంది ప్రారంభించడమైనది నాలుగు సంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకున్న వారిని వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని ఒపీఎస్ నియామక పద్ధతిని రద్దుచేసి వారిని జేపియస్ గా కన్వర్ట్ చేయాలని వచ్చే వేతనాన్ని అందించాలని ప్రధాన డిమాండ్తో సమ్మెలో కొనసాగుతున్నాము. గవర్నమెంట్ నుంచి స్పష్టమైన జీవో పచ్చి వరకు తన పోరాటం కూడా సాగుతుందని మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి షరీఫ్ తిరుపతి పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో మణికంఠ, మహేష్, నూరుద్దీన్, రవిరాజ్ ,విక్రమ్ ,సంజీవ్ కనక, లక్ష్మి, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్దీకరించాలి

**కోరుట్ల టౌన్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్దీకరించాలని కోరుట్లలో పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మెకు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా



నాయకులు మాట్లాడుతూ మేము ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా పరీక్ష రాసి వచ్చినవారిమని ఆ నోటిఫికేషన్ లో ఇచ్చినట్టుగా 3 సంవత్సరాల కాలం ప్రోహిబీషన్ కాలమని ఆ తర్వాత జీవో నం. 26 ద్వారా ఇంకొక సంవత్సర కాలాన్ని పెంచినను మేము పని చేశాం అనేక మార్గాల ద్వారా ప్రభుత్వానికి తెలిపినప్పటికి ఎలాంటి స్పందన లేదని గత్యంతరం లేని పరిస్థితిలో సమ్మె చేయాల్సి వస్తుందని తొమ్మిది వేల మంది ఉగ్యోగులు రోడ్డు పైకి వచ్చారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్యదర్శులను క్రమ బద్దీకరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు వీరికి మద్దతు తెలిపారు.

## మేకలమండి స్కూల్ అదనపు తరగతి గదులకు నిధులు మంజూరు

**సికింద్రాబాద్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** భోలక్ పూర్ మేకలమండి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం తాము



చేసిన విజ్ఞప్తికి స్పందించి మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తన ఎమ్మెల్యే సీడీపీ నిధుల నుంచి రూ 7.70 లక్షలను మంజూరు చేశారని స్కూల్ హెడ్మాస్టర్ కె. మల్లికార్జున రెడ్డి తెలిపారు. శుక్రవారం మంత్రి తలసానిని కలిసిన స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులు నిధులు మంజూరీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి, మంత్రిని శాలువాతో సత్కరించారు.

# ప్రజలపై పన్నుల స్వారీ!

దేశంలో అన్ని వస్తువుల,సేవల ధరలూ పెరిగిపోతూ వుంటే, దాని ప్రభావాన్ని తట్టుకుని భరించే స్థితిలో సామాన్య ప్రజలు లేరు. ప్రభుత్వాలు తాము పెంచుతున్న ధరలు కావచ్చు..జిఎస్టీ కావచ్చు..గ్యాస్ కావచ్చు సామాన్యులకు భారం పడదన్న ధోరణిలో ఉన్నారు. నిజానికి ఏ వస్తువు అయినా ధరలు వెచ్చించి సామాన్యులు కొనాల్సిందే. ఏకీకృత పన్ను విధానం పేరుతో తీసుకుని వచ్చిన జిఎస్టీ ఇప్పుడు సామాన్యులకు గుదిబండగా మారింది. పాన్, ఆధార్ లింక్ కూడా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారనుంది. దీనికితోడు కనీసం వేయి రూపాయల ఛార్జీ వడ్డిస్తున్నారు. వారి ఆదాయాలు పెరగకుండా ధరల పెరుగుదల ను భరించే స్థితిలో ప్రజలు ఉన్నారా లేరా..అన్నది కూడా పాలకులు ఆలోచన చేయడం లేదు. శ్రామిక వర్గ ఆదాయాలు పెరిగే ధరలకు అనుగుణంగా పెరగకుంటే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం ప్రభుత్వానికి సాధ్యం కాదు. శ్రామిక ప్రజల ఆదాయాలు పెరగవని తెలుసు. పెరగడం లేదని కూడా తెలుసు. భారమంతా శ్రామిక వర్గమే అంతిమంగా భరించాల్సి వస్తుందని కూడా పాలకులు తెలుసు. తెలిసి కూడా పెట్రో,గ్యాస్, జిఎస్టీ ధరల పెరుగుదలకు అడ్డూఅదుపు లేకుండా చేస్తున్నారు. ఇక సామాన్యుల ఇంటికలను ఛిద్రం చేసేసారు. సెక్షన్ సామాన్యులు సొంతంగా ఇల్లు కల్లుకునే పరిస్థితి లేదు. మరోపక్క పేదవారి పట్ల పార్టీలు వేరైనా పాలకులంతా మొసలి కన్నీరు కారుస్తోంది. అంతర్జాతీయ చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ, దేశీయంగా పెట్రో ధరలను పెంచి తీరాలన్న సూత్రం ఏదీ లేదు. కానీ అలా పెంచడం వల్ల ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. పెట్రోల్ అన్నది ఇప్పుడు కేంద్రానికి ఆదాయవనరుగా మారింది.

పెట్రో ధరల పెంపు అనేది ప్రభుత్వం అనుసరించే ద్రవ్య వ్యూహం బట్టి ఉంటుంది. ఈ ద్రవ్య వ్యూహాన్ని ప్రభుత్వం ఎప్పటి కప్పుడు మార్చుకునే వీలున్నా అందుకు కేంద్రం సిద్దంగా లేదు. పెట్రో ధరలను తమకు ఇష్టం లేకున్నా పెంచవలసి వస్తోందని వాపోవడం దొంగనాటకం కాక మరోటికాదు. పెట్రో ఉత్పత్తుల ధరలో దాదాపు సగం భాగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులకే పోతుంది. ఈ పన్నులకి, అంతర్జాతీయ చమురు ధరలకి సంబంధం లేదు. అయినా ఆ పన్నులను పెంచుకుంటూ పోతోంది. తన వంతు అదనంగా ప్రజల మీద కేంద్రంలోని మోడీ ప్రబుత్వం భారాన్ని మోపుతూనే పోతోంది. రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని కొంత వరకూ అర్థం చేసుకోవచ్చు. వాటి పరిధిలో పరిమితమైన ఆదాయ వనరులే ఉన్నాయి. ముఖ్యంగా జి.ఎస్.టి విధానం వచ్చాక రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలు బాగా తగ్గిపోయాయి. పెట్రో ఉత్పత్తులు జిఎస్‌టి పరిధి లోకి రావు. అందుకే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు పెట్రో ఉత్పత్తుల మీద పన్నులు వసూలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యక్ష పన్నులు విధించే అధికారం లేనందువలన వాటికి వేరే దారి లేదు. కాని కేంద్ర ప్రభుత్వం వేరు. వేర్వేరు మార్గాల్లో అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలు




పుష్కలంగా ఉన్నాయి. కాని కావాలనే అది ఆ మార్గాలను ఉపయోగించడంలేదు. సంపన్నులమీద ప్రత్యక్ష పన్నులు విధించవచ్చు. ఆ సంపన్నుల పట్ల పక్షపాత వైఖరితో ప్రభుత్వం ఉంది కాబట్టి ఆ ప్రత్యామ్నాయాన్ని అది ఆలోచించడం లేదు. సంపన్న వర్గాలే పెట్రో ఉత్పత్తులను ఎక్కువగా ఉపయోగిస్తాయి గనుక పెట్రో ఉత్పత్తుల మీద ధరలు పెరిగితే వారిమీదే భారం ఎక్కువగా పడుతుందని ఎవరైనా భావిస్తే అది చాలా పొరపాటు. పెట్రో ఉత్పత్తులలో సామాన్య ప్రజలు నేరుగానే వినియోగిస్తారు. ఇందుకు ఉదాహరణ వంట గ్యాస్. ఇక పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే రవాణా చార్జీలు అనివార్యంగా పెరుగుతుంటాయి. దానితోబాటు వినిమయ వస్తువుల ధరలన్నీ పెరుగు తాయి. వాటిలో ఆహార ధాన్యాలతో సహా చాలా వస్తువులను ప్రజలే ఎక్కువగా వినియోగిస్తారు. ఇక సంపన్నులు పెట్రో ఉత్పత్తులను విని యోగించి ఉత్పత్తి చేసే వివిధ రకాల సరుకుల రేట్లను పెంచి అమ్ముతారు. ఆ విధంగా కూడా అంతిమంగా వినియోగ దారుల పైనే భారం అంతా పడుతుంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగుతు న్నప్పుడు పెట్రో ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించు కోవడం కూడా అవసరమే. పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచితే అప్పుడు వాటి వినియోగం తగ్గుతుంది. పెట్రో ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని సామాన్య ప్రజలు మాత్రమే కోరుకుంటారు. ఎందుకంటే వారే నేరుగా బాధ్యులు కనుక.

వినిమయం తగ్గితే మార్కెట్‌లో మాంద్యం మరింత పెరుగుతుంది. అది మరింత ఎక్కువ గా నిరుద్యోగానికి దారి తీస్తుంది. ఆ విధంగా ఒక వైపు ద్రవ్యోల్బణం, మరోవైపు మాంద్యం ఆర్థికంగా దెబ్బ తీస్తుంది. ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల పంపిణీని నియంత్రించి రేషనింగ్ విధానాన్ని అమలు చేయడం ద్వార కొంత కంట్రోల్ చేయవచ్చు. నిజాయితీ ఉంటే ప్రత్యామ్నాయ ద్రవ్య విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధపడాలి. అదికూడా ప్రజలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించాలి. అప్పుడే ప్రజలపై భారం పడదు. నిజానికి ప్రజల నుంచి డబ్బులు గుంజడమెలా అన్నది కేంద్రం చేస్తున్న ఆలోచన.. జిఎస్టీతో ప్రజలు అల్లాడుతున్నా..పన్నులు కట్టలేక చస్తున్నా..పెట్రోల్ ధరలతో దాడులు చేస్తున్నా.. పట్టించు కోని ప్రధాని మోడీ రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలని గతంలో చేసిన సూచనలు ప్రజలంతా గమనిస్తున్నారు. మోడీ వచ్చాక వివిధ రూపాల్లో జిఎస్టీ వసూళ్లు లక్షల కోట్లలో పెంచుకుంటున్నారు. కానీ ప్రజలపై పడుతున్న భారాలపై మాట్లాడడం లేదు. ఈ రోజు వరకు పెట్రోల్, డీజిల్ మీద ఒక పైస కూడా టాక్స్ పెంచలేదని సిఎం కెసిఆర్ ఇప్పటికే కుండబద్దలు కొట్టారు. నిజానికి మోడీ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఏ అంశం పైనా చర్చించడం లేదు.

నిజానికి విజన్ ఉన్న ప్రధానిగా..అంతా బ్రహ్మాండంగా చేస్తున్నామని చెప్పుకుంటు న్న ప్రధానిగా దేశానికి ఒరిగిందేమిటన్న ఆలోచనచేయడం లేదు. ప్రజలను విస్మరించి చేస్తున్న పాలన కారణంగా ప్రజలు నానా యాతన పడుతున్నారు. ప్రజలు ఈ అంశాలపై చర్చించాలి. పాలకుల నిజ స్వరూపాన్ని నిగ్గదీయాలి. అప్పుడే పాలకులు దారికొస్తారు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## పిట్ట పిల్లల తెలివి...

ఒక అడవిలోని చెట్టు మీద పిట్ట గూడు కట్టుకుని నివసిస్తున్నది. దానికి రెండు చిట్టి పొట్టి పిట్ట పిల్లలు ఉండేవి. తల్లి ప్రతి రోజు అడవిలో తిరుగుతూ తన పిల్లలకు కావలసిన ఆహారం తీసుకొని వచ్చేది. అట్టి ఆహారాన్ని పిల్లలకు అందించి తినిపించేది. అమ్మ తెచ్చిన ఆహారం తింటూ, గూటిలోనే ఉండడం పిల్లలకు నచ్చలేదు. తామే స్వయంగా అడవిలో



తిరుగుతూ ఆహారం తినాలని కోరిక కలిగింది.

ఒక రోజు పిట్ట పిల్లలు తమకు అడవిలో తిరగాలని ఉందని, ఆహారం స్వయంగా సేకరించుకోవాలని ఉందని తల్లితో చెప్పాయి. అప్పుడు పిల్లలను నిమురుతూ అవి అడవిలో వెళ్ళడానికి ఇంకా సమయం ఉందని చెప్పింది. ఇంక కొంత పెరిగి పెద్దగైతే గూటిని వదిలి బయటకు వెళ్ళ వచ్చన్నది. ఇప్పుడే బయటకు వెళ్లితే గద్దలు, పిల్లులు, కుక్కలు, పాములు చంపి తినేస్తాయని తల్లి బుజ్జగించినది. అందుకు రెండు పిట్ట పిల్లలు సరేనని తలూపాయి.

ఇలా మరి కొన్ని రోజులు గడిచాయి. పిల్లలకు ఎలాగైనా బయట తిరిగి రావాలని బలమైన కోరిక కలిగింది. కానీ తల్లికి చెబితే వద్దంటున్నది. అందుకే తల్లికి చెప్పకుండానే గూటి నుండి బయటకు వెళ్లాలని రెండు పిల్లలు నిర్ణయించుకున్నాయి. వెంటనే అవి తుర్రున ఎగురుతూ బయటపడ్డాయి. అలా ఎగురుతూ వెళ్తుండగా ఒకచోట జొన్న కంకులు కనబడ్డాయి.

వెంటనే అవి కంకులపై వాలి తినసాగాయి. అంతలో ఒక గద్ద అటు వైపు వెళ్తూ పిట్ట పిల్లలను చూసింది. దానికి ఎలాగైనా వాటిని తినాలని ఆశ కలిగింది. గద్ద మెల్లగా కిందికి వాలుతూ పిల్లల దగ్గరకు వస్తున్నది. గద్ద తమ వైపే రావడాన్ని పిట్ట పిల్లలు చూశాయి. వాటికి తల్లి మాటలు గుర్తుకు వచ్చి భయపడ్డాయి. వెంటనే గద్ద బారి నుంచి తప్పించుకునే మార్గం గురించి ఆలోచించాయి. వాటికి ఒక ఉపాయం తోచింది. రెండు పిట్టపిల్లలు మాట్లాడుకోవడం ప్రారంభించాయి.

మన అమ్మ ఇక్కడికే వస్తానని చెప్పింది. వస్తుందిక అని పెద్ద పిల్ల అన్నది. మన అమ్మతో పాటు, అమ్మ మిత్రురాలైన పాము కూడా ఇక్కడికి వస్తున్నదని చిన్న పిల్ల అన్నది. ఔను...ఔను...అమ్మ, పాము వస్తున్నాయి. వెంటనే వాటితో కలిసి మన గూటికి వెల్లిపోదామని పెద్ద పిట్ట పిల్ల చెప్పింది. పిట్ట పిల్లల సంభాషణ విన్న గద్దకు వణుకు పుట్టింది. పాము వస్తే తనను ఎక్కడ చంపేస్తుందొనని గద్ద భయపడింది. బతికుంటే బలుసాకైన తినవచ్చని, బతుకు జీవుడా అంటూ గద్ద ఎగిరిపోయింది. ఇది చూసిన పిట్ట పిల్లలు సంతోషంగా ఇంటి ముఖం పట్టాయి. తల్లి కంటే ముందే గూటిని చేరుకున్నాయి. తల్లి వచ్చిన తర్వాత జరిగిందంతా చెప్పగా తన పిల్లల తెలివి తేటలను అది ప్రశంసించింది.

**– పోరెడ్డి అశోక్,**
**ఆదిలాబాద్, 8374916403.**

## సాగునీటి వివక్షతపై ఎలుగెత్తి చాటిన విద్యాసాగర్ రావు

### ఏప్రిల్ 29...ఆర్. విద్యా సాగర్‌రావు వర్ధంతి

వలస పాలకుల స్వార్థ పాలనలో, సాగు నీటి రంగంలో జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టు ల్లో మోసంపై గణాంకాలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి విద్యాసాగర్ రావు. తెలంగాణకు నీటి విషయంలో జరిగిన మోసం, ప్రాజెక్టులపై జరిగిన అన్యాయం పై విద్యాసాగర్‌రావు చేసిన పోరాటం, అధ్యయనం అనన్య సామాన్యం. సాగునీటి రంగలో నిపుణులైన విద్యాసాగర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో తెలం గాణకు నీటి కేటాయింపుల విషయంపై జరిగిన అన్యాయం పై ఎలుగెత్తి చాటారు. నీటి పారుదల శాఖలో వివిధ పదవులలో, హోదా లలో పని చేసిన ఆయన, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు



ప్రాజెక్టులు, నీటి కేటాయింపు లపై ఎప్పటికప్పుడు సమాచారం, సలహాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేసేవారు.

సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన ఆధార సహితంగా, బహిర్గత పరిచి, ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ను ప్రేరేపించడంలో, ఉద్యమ తెరాస పార్టీ అధినేతకు వెన్ను దన్నుగా ఉన్నారు. అలా కేసీఆర్‌కు ఉన్న అతి దగ్గర వ్యక్తులలో విద్యాసాగర్ రావు ఆంతరంగిక ముఖ్యులలో ఒకరై పోయారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తన పరి జ్ఞానంతో కొత్త ప్రాజెక్టుల రూప కల్పనలో ఆయన భాగస్వామ్యం విడదీయ జాలనిది, ఆయన పాత్ర నిజంగా మరువలేనిది..

"జయశంకర్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప తెలంగాణ మహాను భావుడు విద్యాసాగర్ రావు" అని కేసీఆర్ చేత ప్రశంసింప బడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ ఆయన. ఆర్. విద్యాసాగర్‌రావు (14 నవంబరు 1939 – 2017 ఏప్రిల్ 29) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన జాజిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యా వంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్థితి, వారి కుటుంబంలో అందరికీ చదువు పట్ల ఆసక్తి కలగడానికి హేతువైంది. వారి గ్రామంలో తొలి సారిగా మెట్రిక్యులేషన్ చేసిన వ్యక్తి రాఘవ రావు కాగా, మొదటి పట్టభద్రులు రాఘవరావు పెద్ద కుమారుడు, మొట్ట మొదటి ఇంజనీరింగ్ పట్టభద్రుడు విద్యాసాగర్‌రావు కావడం విశేషం.

విద్యాసాగర్ రావు 1960లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి ఇంజనీరింగ్ లో పట్టభద్రు లయ్యారు. 1979 లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి రూర్కీ) లో నీటి వనరుల అభివృద్ధి లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన 1983లో అమెరికా లోని కొలోరాడో స్టేట్ విశ్వ విద్యాలయం నుండి నీటి వనరుల వ్యవస్థ ఇంజనీరిం గులో డిప్లొమా పొందారు. ఆయన 1990లో ఢిల్లీ విశ్వ విద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టాను కూడా సంపాదించారు.

బీటెక్ పూర్తి అయిన వెంటనే క్యాంపస్‌లోని మహిళా కాలేజీ మెయింటెనెన్స్ ఇంజినీరుగా ఉద్యోగంలో చేరారు. కళల పట్ల ఆసక్తి కలిగిన ఆయన, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా రాయటం, నాటకాలు వేయడం వంటి హాబీ లకు దూరం కాలేదు. అను దినం సాయంత్రం విధుల నిర్వహణ అనంతరం రవీంద్ర భారతికి వెళ్ళేవారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి, అనంతరం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, నీటిపారుదల శాఖలో ఇంజ నీరుగా పనిచేశారు. ఢిల్లీలో ఉన్న సమయంలో సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసు కున్నారు. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాక, తరువాత తిరిగి హైదరాబాద్ వచ్చారు. దాదాపు 34 సంవత్స రాల పాటు కేంద్ర జల సంఘం లోనే విధులు నిర్వహించడం తో ఆయన దేశ వ్యాప్తంగా జల వనరుల అంశంపై అపారమైన అనుభవం గడించారు.

తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల విషయాలపై సమగ్ర అవగా హన, సరైన ఆలోచనను కలిగి ఉండేవారు. 2016 నవంబ రులో కాకతీయ విశ్వ విద్యాలయంచే నిర్వహించ బడిన "మిషన్ కాకతీయ" ప్రాజెక్టుకు సంబంధించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలో వ్యవసాయ రంగంలో నీటి పారుదల ప్రాజెక్టు లపై ప్రభుత్వ విధానాలను సమగ్రంగా వివరించారు.

2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (భారత దేశం) ఆయనను "లీడింగ్ ఇంజ నీరింగ్ పెర్సనాలిటీస్ ఆఫ్ ఇండియా"గా గుర్తించి, పురస్కార గ్రహీతను చేసింది. ఆయన ఎన్నో రచనలు చేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాల న్నింటినీ కలిపి.. 'నీళ్లు-నిజాలు' పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. అలా "నీళ్ళ నిజాలు విద్యాసాగర్ రావు"గా పేరెన్నిక గన్నారు. ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రంలో ఉచిత పాత్రలో నటించారు.

ఐక్యరాజ్య సమితి ఇన్విరాన్ మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యు డిగా, సెంట్రల్ వాటర్ కమి షన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా సేవలు అందించిన విద్యాసాగర్ రావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన లోనూ సలహాలు అందించారు. సాగునీటి రంగ రిటైర్డ్ చీఫ్ ఇంజనీరుగా, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగా



**–ఆర్కె సంగనభట్ల**
**9440595494**

సుపరిచితులు అయిన విద్యా సాగర్‌రావు రచయితగా, నటునిగా చూపిన ప్రతిభ గురించి చాలా మందికి తెలియదు.

గిరీషం కలం పేరుతో ఆయన రాసిన రచనలు అనేక పత్రికల్లో ప్రచురించారు. బాల్యంలో కవి సమ్మేళనాలు, నాటకాల ప్రదర్శనలకు వెళ్లేవారు. కాలేజ్ స్థాయి వివిధ పోటీల్లో పాల్గొని, నాటకాలు కూడా వేసేవారు.

కొంతకాలం ఆనారోగ్యానికి గురై, 2017 ఏప్రిల్ 29న హైదరా బాద్‌లో దివంగతులైనారు.

## అదృష్టం బజారులో దొరికే వస్తువు కాదు! (ఆధ్యాత్మిక చింతన)

ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి వెళ్ళాలి. ముందుకు పయనించాలి. అభ్యుదయం వైపు సాగిపోవాలి. ప్రగతిశీలమైన ఆలోచనలు చేయాలి. ధీర చిత్తులై విజయపథాన పురోగమించాలి' అని అధర్వవేదం మనకు దిశానిర్దేశర చేస్తోంది.

దిగులుపడుతూ కూర్చుంటే లాభంలేదు. ఎవరిని వారు నిందించుకుని ఉపయోగం లేదు. అదృష్ట భాగ్యమనేది విపణిలో లభించే వస్తువు కాదు. మనకున్న వనరులతో, మన శక్తియుక్తుల్ని వినియోగించి దక్కించుకునేవారే జీవితంలో విజేతలవుతారు. ఏ జన్మలో ఏ పాపం చేశానో, ఇప్పుడిలా అనుభవిస్తున్నాను- అని భావిస్తూ నిష్క్రియాపర్వతని అవలంబిస్తే ఫలితం శూన్యం. ఏ పని చేపట్టినా, ముందుగా తార్కిక విశ్లేషణ అవసరం. గతం, వర్తమానం, భవిష్యత్తు అంశాల ప్రాతిపదికన జీవన వ్యవహారాల్ని తీర్చిదిద్దుకోవాలి.

గతానుభవాలు నేపథ్యంగా వర్తమాన వ్యవహార శైలిని మలచుకోవాలి. అప్పుడు భవిష్యత్తు ఆశామయంగా, ఆనంద యుతంగా భాసిల్లుతుంది. ఈ క్రమానుగత ప్రణాళికనే 'విజయ దర్శనం'గా శ్రీరాముడితో వసిష్ఠుడు పేర్కొన్నాడు.

# నిప్పుల కొలిమిగా భూగోళం

విశ్వంలో సమస్త జీవరాశులతో పాటు మానవ జాతి లాంటి జీవులు ఉన్న ఏకైక గ్రహం ఈ భూగోళమే. భూమి పుట్టుక గూర్చి అతి ప్రాచీన కాలం నుండి అనేక భావనలు ప్రచారంలో ఉన్నవి. పృథ్వీ, ధరణి, పుడమి, ధరిత్రి అనే పలు పేర్లతో పిలువబడుతున్న భూమి, ధర్మం (సార్వత్రిక ప్రయోజనం) అనే భావనతో అన్యోన్యాశ్రిత సంబంధాన్ని కలిగి ఉంది. కనుకనే భారతీయులు భూమిని 'భూమాత' అని అన్నారు. ప్రముఖ ప్రాచీన భారతీయ గణిత, ఖగోళ శాస్త్రవేత్త అయిన ఆర్యభట్టు (క్రీ.శ.476-550) తన 'ఆర్యభట్టీయం' అనే గ్రంథంలో భూగోళః సర్వత్ వృతః అనగా భూమి వృత్తాకారంగా, అన్నీ వైపులా వ్యాపించి ఉందని చెప్పాడు. వరాహమిహీరుడు అనే మరో ప్రాచీన భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞుడు (క్రీ.శ. 505- 587) తన పంచ సిద్ధాంతిక అనే గ్రంథంలో భూమి గూర్చి పంచ భూతాలతో నిర్మితమై గుండ్రని భూమి పంజరంలో వేలాడే ఇనుప బంతిలాగా ఖగోళంలో తారల మధ్య నిలిచి ఉన్నది అని వ్యాఖ్యానించాడు. కానీ భూమి ఒక గ్రహమని, సూర్య కుటుంబంలో ఒక భాగమని, బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం ప్రకారం భారీ విస్ఫోటనంతోబద్దలై సూర్యుని నుండి విడివడిన ఒక చిన్నముక్క భూమి అని ఆధునిక సైన్సు చెబుతోంది. నేడు అనేక సంపన్న దేశాలు సూర్య కుటుంబానికి ఆవల భూమి లాంటి మరో భూమి సెకండ్ ఎర్త్ ఉనికిని కనుగొనడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రహాంతర జీవుల జాడ కోసం కూడా ముమ్మరంగా పరిశోధనలు జరుగుతున్నాయి. సుదీర్ఘ వయస్సు గల భూమిపై మానవుల ఆధిపత్యం (ఆంత్రపోసెంట్రిజం) పెరుగుతున్న కొలది భూమిపై ఎన్నో రకాల మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

మానవుడు తన స్వార్థ ప్రయోజనాల కోసం జరిపే ప్రకృతి వనరుల విధ్వంసం, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాల పెరుగుదల వంటి మతిమాలిన, ప్రకృతి విరుద్ధ చర్యలతో భూమి వేడెక్కడం (భూతాపం) వంటి విపరీత పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి. తద్వారా భూగోళంపై మానవుని మనుగడకే ప్రమాదం ముంచు కొస్తున్నది. కనుక భూమికి, ప్రకృతికి కలుగుతున్న విధ్వంసాన్ని నిలువరించి, పుడమిని పరిరక్షించాలనే బృహత్తర లక్ష్యంతో ప్రతి యేటా ఏప్రిల్ 22 న ప్రపంచ ధరిత్రి దినోత్సవం (వరల్డ్ ఎర్త్ డే) ను జరుపుతున్నాము. అమెరికన్ సెనేటర్, పర్యావరణవేత్త గెలార్డ్ నెల్సన్ ఆలోచనల స్ఫూర్తితో, జాన్ మెక్నెల్ చొరవతో, 1969 డిసెంబర్ నెలలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోప్రపంచ ధరిత్రి దినోత్సవం జరుపాలని నిర్ణయించనైనది.

అందుకనుగుణంగా 1970 ఏప్రిల్ 22 న మొట్టమొదటి ప్రపంచ ధరిత్రి దినోత్సవం జరిగింది. గత సంవత్సరం 2022 ఏప్రిల్ 22న మన గ్రహంపై పెట్టుబడి అనే ఇతివృత్తంతో ధరిత్రి దినోత్సవాన్ని జరుపుకున్నాము. ఈ సంవత్సరం కూడా గత ఏడాది ఇతివృత్తం కొనసాగింపుగా మన గ్రహంపై పెట్టుబడి (ఇన్వెస్ట్ ఇన్ అవర్ ప్లానెట్) అనే నినాదంతోనే 54వ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించు కొంటున్నాము. 193 దేశాలకు పైగా ఈ పుడమి పండు గను జరుపుకుంటున్నాయి. ఇందులో భూతాపం, ప్రకృతి పరిరక్షణ, వాతావరణ మార్పు, జీవ వైవిధ్య సంరక్షణ, ధరిత్రి పరిరక్షణల గూర్చి ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్దేశించబడింది. భూగోళంపై సుమారు 71% నీరు, 29% భూభాగం ఉంది. ఇప్పుడు భూగ్రహం అనేక సమస్యలను, సవాళ్లను ఎదుర్కొనుచున్నది. భూమండలంపై శిలాజ ఇంధనాల అతి వినియోగం, కార్బన్ డై ఆక్సైడ్ వంటి గ్రీన్ హౌజ్ వాయువుల ఉద్గారాలు రోజు రోజుకూ పెరుగుతుండటం వల్ల కలిగే భూతాపం మానవాళికి పెనుశాపంగా మారుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి వనరుల విధ్వంసం, పర్యావరణ కాలుష్యం, ప్రకృతిలో అకస్మాత్తుగా చోటు చేసుకుంటున్న అసాధారణ వాతావరణ మార్పులు, అడవుల నరికివేత, సముద్ర జలాల ఆమ్లత్వం, ఎయిరోసాల్స్, వేడిగాలులు, ఫారెస్ట్ ఫైర్స్, ఓజోన్ పొర క్షీణత, అణు యుద్ధాలు, బయోవార్స్, కెమికల్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ వాడకం మొదలగు అంశాలు మానవుని ఆందో ళనకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న జనాభా అవసరాలు తీరే విధం గా, భూతాపాన్ని ఎలా తగ్గించాలి! కాలుష్యం నుండి భూమిని ఎలా రక్షించుకోవాలి! భూగోళ సుస్థిరతను ఎలా కాపాడుకోవాలి! అనేవి మన ముందున్న ప్రధాన సవాళ్ళు. భూతాప నియంత్రణపై 2016లో జరిగిన పారిస్ ఒప్పం దం (కాప్-21) ప్రకారం 2030 నాటికి, పారిశ్రామిక విప్లవం నాటి కంటే ముందు పరిస్థితులతో పోలుస్తూ భూ ఉష్ణోగ్రత పెరుగుదలను 2 సెంటీగ్రేడ్ డిగ్రీల వరకు పరిమితం చేయాలని ప్రపంచ దేశాలన్నీ నిర్ణయించాయి.

కానీ అధిక కర్బన ఉద్గారిత దేశాలు పారిస్ ఒప్పందం అమలులో ఆసక్తి కనబరుచుట లేదని, ఇప్పటి వరకు



ఆచరణలో ఆశించిన పురోగతి లేదని డిసెంబర్ 2022లో జరిగిన ఈజిప్ట్ సదస్సు (కాప్-27) పేర్కొంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే 2030 2052 సంవత్సరాల మధ్య 1.5 సెంటిగ్రేడ్‌ల భూఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఆ తర్వాత 10-15 ఏండ్లలో ఉష్ణోగ్రత 2 డిగ్రీల కంటే ఎక్కువగా పెరుగుతుందని, దీన్ని అరికట్టాలంటే 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా కర్బన ఉద్గారాలను సగానికి పైగా తగ్గించాలని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం వారి గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ అవుట్ లుక్ రిపోర్ట్ స్పష్టం చేసింది. సమీప కాలంలో భారత్‌తో సహా ప్రపంచ దేశాలలో పరిమితికి మించి వేడిగాలులు వీస్తాయని, తద్వారా మెజారిటీ ప్రజలు ఉష్ణ వత్తిడిని ఎదుర్కొంటారని తాజా అధ్యయనాలు పేర్కొం టున్నాయి. మన దేశంలో 80 శాతానికి పైగా ప్రజలు ఎండ తీవ్రత, వడగాడ్పుల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారని, 2050 నాటికి ఈ సమస్య తీవ్రతరం అవుతుందని ఏప్రిల్ 2023లో విడుదలైన కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రమిత్ దెబనాథ్ నేతృత్వంలోని అధ్యయన నివేదిక తెలిపింది.

ఒకవేళ ఇప్పుడున్న భూ ఉష్ణోగ్రత 20%ఎ% కంటే ఎక్కువగా పెరిగితే ధ్రువ ప్రాంతాల్లో మంచు ఫలకాలు కరుగుతాయి. సముద్రాలు పోటెత్తుతాయి. సముద్రతీర నగరాలు, చిన్న చిన్న దీవులు నీట మునుగుతాయి. రుతువులు గతి తప్పుతాయి. మండుటెండల్లో కుండపోత వర్షాలు కురుస్తాయి. వర్షాకాలంలో ఎండలు భగ్గుమం టాయి. అకాల వర్షాల వల్ల, వరదలు పంట నష్టం, జంతువుల వలసల్లో మార్పులు కనిపిస్తాయి. వడగాడ్పులు, కరువు, కాటకాలు ఏర్పడుతాయి. నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూతాపం వల్ల భూమి ఉపరితలం వేడెక్క డమే కాకుండా, సముద్రాల అడుగు భాగం కూడా వేడెక్కు తున్నట్లు వాషింగ్టన్ లోని నేషనల్ ఓషనిక్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ తన తాజా నివేదిక -2023 లో తెలిపింది. సముద్రాలలో కలిగే వేడి అలల (మెరైన్ హీట్ వేవ్స్) ప్రభావంతో అక్కడి జీవావరణ వ్యవస్థలోని ప్లాంక్టన్ మొదలు నీలి తిమింగలాల వరకు అన్నీ జీవుల మనుగడ ప్రమాదంలో పడుతోందని కూడా ఆ నివేదిక తెలియజేసింది. భూతాపం పెరుగుదలను అరికట్టలేకపోతే సముద్రాలు సలసల కాగిపోవడం ఖాయమని, ఫలితంగా సమీప కాలంలో భూమి నిప్పుల కొలిమిగా మారుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ పరిస్థితిని తక్షణం అడ్డుకోకపోతే భూమి ఉష్ణో గ్రతలు గత 3 లక్షల సంవత్సరాలలో ఎన్నడూ లేనంత స్థాయికి పెరిగిపోతాయి. అప్పుడు తలెత్తే విపత్తుల గురించి మాటల్లో చెప్పలేము అని సూత్రీకరించిన ప్రముఖ అమె రికన్ శాస్త్రవేత్త నోర్డ్ హౌస్ మాటలు నిజం కాకమానవు. మానవాళి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్న ఈ తరుణంలో భూగోళ పరిరక్షణకు అవగాహనా పరిష్కార మార్గాలు కనబరచకపోతే ముందు తరాలు మనల్ని క్షమించవు. మానవ జీవనవికాసాన్ని, లక్ష్యాన్ని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రకృతి వనరుల పరిమిత వినిమయంతో, ఆర్థిక లక్ష్యాలను సాధించే దిశలో ప్రజలు, ప్రభుత్వాలు హెల్దీ ప్లానెట్ ఫర్ హెల్దీ పీపుల్ అనే ఆచరణాత్మక వైఖరితో ప్రణాళికలు రూపొందించాలి. ఐక్యరాజ్య సమితి పర్యావరణ విభాగం తీర్మానాలు ప్రపంచ దేశాలు కచ్చితంగా పాటించాలి. ప్రభుత్వాల పరంగా భూపరిరక్షణ, పర్యావరణ చట్టాలను కఠినతరం చేయాలి. ప్రకృతి వనరుల శోషణ కాకుండా, ఆ వనరుల పోషణ, సంరక్షణలే పరమావధిగా కృషి జరుగాలి.

భూగోళంపై ప్రకృతి వనరుల పరిరక్షణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంచడంతో పాటు, ఉత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని విస్తరించడం, సుస్థిర సేద్య విధానాలకు పెద్దపీట వేయడం, ఆటవీ పరిరక్షణ ప్రాధాన్యాంశాలుగా గుర్తించి, అందుకనుగుణంగా తగు చర్యలు తీసుకోవడం వల్ల పుడమిని భూతాపం నుండి స్వాంతనం కలిగించవచ్చును. ప్రజలు సాధ్యమైనంత వరకు పర్యావరణ సానుకూల ఉత్పత్తులనే ఉపయోగించాలి. డిస్పోజబుల్ ప్యాకేజీలకు దూరంగా ఉండాలి. హరితహారం స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా 'గ్రీన్ హ్యాండ్స్' పేరుతో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాల నిర్వహణకు నడుం బిగించాలి. పర్యావరణ రక్షణకు ప్రతి పౌరుడు పునః వాడకం, పునః చక్రియం, పునరుద్ధరణ, తగ్గింపు, పునః అభివృద్ధి అను 5 ఆర్స్ ఫార్ములాను పాటించాలి. భూతాపం, పర్యావరణ పరిరక్షణ, అడవుల నరికివేత, జీవరాశుల కనుమరుగు, కాలుష్యం, ఓజోన్ పొర క్షీణత వంటి అంశాల గూర్చి ప్రజలను వాతావరణ అక్షరాస్యులు (క్లైమేట్ లిటరేట్స్)గా, పర్యావరణ సంరక్షకులుగా మార్చుటకు అవగాహనా సదస్సులు, ఊరేగింపులు, భూవారోత్సవాలు, కరపత్రాల పంపిణీ, వన మహోత్సవం లాంటి కార్యక్రమాలు చేపట్టాలి. విద్యార్థులను పర్యావరణ ఉద్యమ సైనికులుగా తయారు చేయాలి. మానవాళి ప్రస్తుతం అతి పల్చటి మంచు పొరపై ఉన్నదని, అది వేగంగా కరిగిపోతున్నదని ఇటీవల బెర్లిన్ సదస్సులో యుఎన్ఓ సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ వాఖ్యానించిన మాటలు భూగోళంపై మానవాళి మనుగడ అత్యంత ప్రమాదంలో ఉందని తెలియజేస్తున్నాయి. కనుక ప్రకృతిలో భాగమైన మానవుడు తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కొంటూ, తననష్టాన్ని తానే కొనితెచ్చుకుంటున్న భస్మాసుర ప్రవృత్తిని విడనాడి పర్యావరణ పరిరక్షణకు, భూగోళ సంరక్షణకు పాటుపడాలి.

# దళితజాతి ఆత్మగౌరవాన్ని ఆకాశానికెత్తింది కేసీఆరే

### చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్

**జగిత్యాల ఏప్రిల్ 28 (ప్రజా మంటలు):** ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రవి శంకర్ మాట్లాడారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు పతకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం అమలు దశలోనే ఎవరు అవినీతికి పాల్పడినా సహించనని కేసీఆర్ హెచ్చరించారన్నారు.

అందుకు మద్దతుగా ఎమ్మెల్యేలందరము ఒప్పుకొని తప్పుచేస్తే శిక్షించమని చెప్పామని రవి శంకర్ అన్నారు. కేసీఆర్ ఎవరు తప్పు చేసినా ఉపేక్షించడని అందుకు ఉదాహరణగా బొడిగే శోభ, బాబు మోహన్ల పేర్లను వెల్లడించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి దళిత జాతిని అవమానపరుస్తున్నారంటూ, వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారంటూ బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారని అన్నారు. 60 ఏండ్ల కాలంలో దళిత జాతికి మీ కాంగ్రెస్ పార్టీ చేసిందేమిటి చెప్పాలని రవి శంకర్ ప్రశ్నించారు. ఈ తొమ్మిదేండ్లలో దళితులకు ఏమి చేశామో గళ్ళ ఎగరేసుకొని చెప్తామని రవి శంకర్ అన్నారు. దళిత జాతి ఆత్మగౌరవాన్ని ఆకాశానికి ఎత్తిన ఘనత బీఆర్ ఎస్ పార్టీది కేసీఆర్ దని కొనియాడారు. దేశంలోనే అతి పెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని హైద్రాబాద్ లో ఏర్పాటు చేశామని అన్నారు. అంబెడ్కర్ గౌరవాన్ని మీరు ఎక్కడ పెట్టారో ప్రజలందరికీ తెలుసన్నారు. మీ పాలనలో ఎస్సి కార్పొరేషన్ రుణాలు పొందాలంటే దళితులు బ్యాంకర్ల చుట్టూ చెప్పులరిగెల తిరిగినా అవి దక్కేవి కావన్నారు. మీ కాంగ్రెస్ పాలనలో అవినీతి అక్రమాలు లేకుండా ఏ పథకమైన అమలైందా చెప్పాలని జీవన్ రెడ్డిని ఎమ్మెల్యే రవి శంకర్ ప్రశ్నించారు. బీఆర్ ఎస్ అందిస్తున్న ప్రతి పథకానికి సంబంధించి పారదర్శకంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే రవి శంకర్ అన్నారు. నయా పైసా ఖర్చు లేకుండా మధ్య వర్తుల లేకుండా అర్హులకు అందిస్తున్నామన్నారు. దళితుల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పు తేవాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విదంగా దళిత బంధు పతకాన్ని సీఎం కేసీఆర్ అమలుచేస్తున్నారన్నారు. జీవన్ రెడ్డి మాట్లాడేముందు కొంచమైన ఆలోచన చేసివుండాలని రవి శంకర్ అన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాము, సచివాలయానికి అంబేద్కర్ పేరుతోపాటు పరిపాలనా సౌలభ్యం కోసం 33 జిల్లాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్ దన్నారు. మీ పాలనలో ఎడారిగా మారిన రాష్ట్రాన్ని తెలంగాణ ప్రభుత్వం సస్యశ్యామలం చేసిందన్నారు. సాగు నీటి




కష్టాలు మీ పాలనలో అనేకమని వానమ్మ వానమ్మ అని ప్రజలు రైతులు పడుకున్న విషయాన్ని జీవన్ మరిచిపోయాడన్నారు. మీ పార్టీ గల్లీలో లేదు ఢిల్లీలో లేదు దేనికోసం జీవన్ రెడ్డి ఇష్టారాజ్యంగా అసత్య ఆరోపణలు చేస్తున్నాడో అర్థము కావడం లేదన్నారు. మీరెన్ని చేసినా తిరిగి రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమని వంద సీట్లతో అధికారంలోకి వస్తామని రవి శంకర్ చెప్పారు. దళిత బందులో అవినీతి జరిగితే సహించమని నేరుగా ఎమ్మెల్యేలను బాధ్యులను చేస్తామని సీఎం ఎప్పుడో చెప్పి టిక్కెట్లు ఇవ్వమని హెచ్చరించారని రవి శంకర్ చెప్పారు. మీ కాంగ్రెస్ పాలనలో జరిగిన అవినీతిని చూసే నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి డబ్బులు వేస్తున్నారన్నారు. మీ కాంగ్రెస్ పాలనలో దళితులను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తే మేము వారి అభివృద్ధి, సంక్షేమం కోసం తపన పడుతున్నామని ఎమ్మెల్యే రవి శంకర్ అన్నారు. సీఎం కేసీఆర్ మాటలను వక్రీకరించి మాట్లాడడం జీవన్ రెడ్డికి భావ్యం కాదని వయసు మీదపడి అన్ని నెరిసి మాట్లాడే మాటలన్నారు. దళిత బందులో అవినీతి జరిగితే నిరూపించాలి తప్ప మాటలను వక్రీకరించి మాట్లాడడం సమంజసం కాదన్నారు. పేదలను ఉన్నతంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నినాదం గరిబి హఠావో అని మాలాగా 2 లక్షల 70 వేల ఇండ్లను ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇండ్లు నిర్మించుకునేందుకు స్థలం ఉంటే 3 లక్షలు ఇస్తామని, రాష్ట్రంలో ఉద్యోగులకు ఇస్తున్న జీతాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. బిజెపి రాష్ట్రాల్లో, మీ కాంగ్రెస్ పాలనలో దళితుల మీద జరిగిన దాడులను మరిచిపోయారా అని ప్రశ్నంచారు. మీ మాటలు, మీ కాంగ్రెస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి ఇప్పుడు లెవని, తెలంగాణలో అమలవుతున్న పథకాలన్నింటిని దేశవ్యాప్తంగా అమలుచేయడానికే బీఆర్ఎస్ జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టిందని రవిశంకర్ అన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడిగా గౌరవంతో చెపుతున్నానని జీవన్ రెడ్డి మతిభ్రమించి ఏది మాట్లాడినా ఊరుకునేదిలేదని ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్,జెడ్పీ ఛైర్మెన్ దావా వసంత సురేష్,జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మెన్ డా.గొల్లపల్లి చంద్రశేకర్ గౌడ్ గారు మల్యాల జెడ్పీటీసీ రామ్మోహన్ రావు, పాక్స్ ఛైర్మెన్ సాగర్ రావు,మల్యాల ఏఎంసి ఛైర్మెన్ నరేందర్ రెడ్డి,జగిత్యాల,బీర్ పూర్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు చెరుకు జాన్,నల్ల మహిపాల్ రెడ్డి, బి సి సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి వంశీ బాబు,నాయకులు రాజేందర్ ,అశోక్, కొండగట్టు ఆలయ డైరెక్టర్ సురేష్, నక్కగంగాధర్, నారాయణ, మల్లేశం, కోమురయ్య, గంగిపెళ్ళి శేకర్, సునీల్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దళితబంధులో ఆరోపణల పర్వం

### బాద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్

**జగిత్యాల,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** దళితబంధు పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. 2023లో నియోజకవర్గంలోని 1500 మంది అర్హులకు లబ్ది చేకూరుస్తామని చెప్పి..15 వేల 700 కోట్ల నిధులు కేటాయించి.. కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదన్నారు. దళితబంధులో బీఆర్ఎస్ నాయకులే 2 నుండి 3 లక్షల వరకు అవినీతికి పాల్పడుతున్నారని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆరే అన్నారని గుర్తు చేశారు. కేవలం ఆరోపణలు రావడంతోనే ఏ ఆధారం లేకుండా తాటికొండ రాజయ్యను డిప్యూటీ సీఎం పదవి నుంచి తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు, ఆధారాలు ఉన్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. దళితబంధు పథకం గురించి కేవలం ప్రకటనలతోనే పబ్బం గడుపుతున్నారంటూ మండిపడ్డారు. దళితబంధు కార్యక్రమంలో చేతివాటం పాల్పడిన బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే అవినీతిని ప్రోత్సహించిన వారిలో కేసీఆర్ మొదటివారు అవుతారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి పొందిన వారందరికీ ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఉద్యోగ నియామకాలు జాప్యం చేయడానికేపేపర్ లీకేజీ కూడా ఒక ప్రధాన కారణమని ఆరోపించారు.

# వివేకా హత్య కేసులో కీలక పరిణామం

### విచారణ జూన్ 2కు వాయిదా

**హైదరాబాద్,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసు విచారణను నాంపల్లి సీబీఐ కోర్టు జూన్ 2తేదీకి వాయిదా వేసింది. మరోవైపు ఈ కేసు సంబంధించిన నిందితులను సీబీఐ అధికారులు నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి కూడా సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. అతనితో పాటుగా దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి,ఉమాశంకర్ రెడ్డి, సునీల్ యాదవ్ లను సీబీఐ అధికారులు నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. అటు ఎర్ర గంగిరెడ్డి బెయిల్‌ను తెలంగాణ హైకోర్టు ఏప్రిల్ 27 గురువారం రోజున రద్దు చేసింది.




ఈ కేసులో ఎర్ర గంగిరెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నాడని ..అతను బయట ఉండటం వల్ల దర్యాప్తులో సహకరించడానికి ప్రజలు ఎవరూ ముందుకు రావడం లేదని సీబీఐ హైకోర్టుకు తెలిపింది. విచారణ కీలక దశలో ఉన్నప్పుడు అతడి బెయిల్ రద్దు చేయాలని హైకోర్టుకు వివరించింది. సీబీఐ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు ,వచ్చే నెల మే 5లోపు హైదరాబాద్ సీబీఐ కోర్టు ముందు లొంగిపోవాలని గంగిరెడ్డిని ఆదేశించింది. సీబీఐ కోర్టులో లొంగిపోకపోతే అరెస్ట్ చేయవచ్చునని తెలిపింది. 2019 మార్చి 14వ తేదీ రాత్రి పులివెందులలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగింది. ఈ హత్య కేసును సీబీఐ విచారిస్తోంది. ఈ కేసు దర్యాప్తును ఈ ఏడాది జూన్ 30వ తేదీ లోపుగా పూర్తి చేయాలని ఇటీవలనే సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో ఈ కేసు దర్యాప్తును సీబీఐ మరింత వేగవంతం చేసింది.





# అంగరంగ వైభవంగా కుంకుమ పూజలు

### విశేష సంఖ్యలో పాల్గొన్న మహిళలు

**జగిత్యాల ఏప్రిల్ 28 (ప్రజా మంటలు):** పట్టణంలోని. శుభమస్తు గార్డెన్ లో ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ విషు శర్మ చే శివపురాణ సప్తాహం 5 వ రోజుకు చేరింది.

శుక్రవారం కార్యక్రమ నిర్వాహకులు వూటూరి అశోక్ బాబు-రమాదేవి దంపతులు మహిళలచే సామూహిక కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు., సుమారు 400 మంది మాతలు కుంకుమ పూజలో పాల్గొన్నారు., వేద పండితులు విషు శర్మ శివపురాణంలోని శంక చూడుడి వృత్తాంతం, అందకాసురుడి జననం, అందకాసురుడి తపస్సు, ఆంధకాసురుడి వరం, అందకాసురుడికి ఘనాద్యక్ష పదవి, మరియు ద్వాదశ జ్యోతిర్లింగాల వైభవం, నందీశ్వరుని అవతారం, మొదలగు ఘట్టాలను భక్తులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో మంచాల జగన్, కొత్త పెల్లి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త తౌటు రామచంద్రం, కొత్తపెల్లి నాగభూషణం, బొల్లం వంశీకృష్ణ ,స్పందన, రేణిగుంట ఉమా శంకర్, సృజన ,అర్వపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు



# యాదాద్రిలో నారసింహ జయంతి ఉత్సవాలు

### భారీగా ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు

**యాదగిరిగుట్ట,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్య క్షేత్రంలో నృసింహ జయంత్యుత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. యాదాద్రిలో



ఏటా నృసింహ జయంతి వేడుకలు వైభవంగా జరుగుతాయి. ఈ యేడాది మే 2వ తేదీ నుంచి 4వతేదీ వరకు నృసింహ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. అను బంధ పాతగుట్ట, దబ్బగుంటపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయా ల్లోనూ నృసింహ జయంత్యుత్సవాలు సంప్రదాయరీతిలో నిర్వహించనున్నట్టు దేవస్థాన ఈవో గీతారెడ్డి తెలిపారు. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలు, మామిడి, అరటి, వివిధ రకాల పూలమాలతో అలంకరించనున్నట్టు తెలిపారు. మహోత్సవాల్లో పాల్గొనే రుత్వికులకు ఆహ్వానాలు పంపినట్టు తెలిపారు. దేవస్థాన ఉద్యోగులకు సెలవులు రద్దు చేశామని, వేసవి సెలవులు కావడంతో మహోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారని,భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఆలయ తిరువీధి అలంకార వాహన సేవలు ఉదయం, సాయంత్రం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మూడు రోజుల పాటు మూల మంత్ర, మూర్తి హవన పూజలు, జపాలు, లక్ష కుంకుమార్చన, లక్షపుష్పార్చన, సహస్రఘటాభిషేక పూజలు కొనసాగుతాయని, అర్చక స్వాములు వైదిక పర్వాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు.

యాదగిరిక్షేత్రంలో, అనుబంధ పాతగుట్ట ఆలయాల్లో కొనసాగనున్న నృసింహ జయంతి వేడుకలను పురస్కరించుకొని భక్తులు స్వామి సన్నిధిలో జరిపించుకునే ఆర్జిత సేవలు మొక్కు, శాశ్విత కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హవన పూజలు నిలిపివేసినట్టు ఈవో గీతారెడ్డి తెలిపారు. జయంత్యుత్సవాలు పరిసమాప్తమైన తర్వాత మే 5వ తేదీ నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు కొనసాగుతాయని తెలిపారు.

# రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగం అభివృద్ధి

### ప్రాధాన్యతా రంగంగా గుర్తించి వసతుల కల్ప
### టెక్స్‌టైల్ పార్కులతో నేతన్నలకు ఉపాధి
### తిర్పూర్ తరహాలో రాష్ట్రంలోనూ కార్యక్రమాలు
### చేనేతపై సమీక్షలో మంత్రి కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్28(ప్రజా మంటలు):** రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగం అభివృద్ధి కోసం ప్రాధాన్యత రంగంగా గుర్తించిన ప్రభుత్వం, రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి కెటిఆర్ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మినీ టెక్స్‌టైల్ పార్కులు, టెక్స్‌టైల్ పార్కులు, అప్పారెల్ పార్కుల అభివృద్ధిని చేపట్టామన్నారు. ఆయా పార్కుల్లో ఇంకా మిగిలిపోయిన పనులు ఏవైనా ఉంటే వెంటనే వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో బ్లాక్ లెవల్ క్లస్టర్ల పనితీరుపైన, వాటి పురోగతిపైన ఒక నివేదికను వెంటనే తయారు చేసి అందివ్వాలని ఆదేశించారు. గుండ్ల పోచంపల్లి అప్పారెల్ పార్క్, గద్వాల్ హ్యాండ్లూమ్ పార్క్ కార్యక్రమాలపైన మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా సమీక్షించారు. బీఆర్‌కే భవన్‌లో టెక్స్‌టైల్ శాఖపై మంత్రి కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలపైన, వాటి అమలు తీరుపైన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేతన్నల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో పనిచేస్తుందని తెలిపారు. కేసీఆర్ దిశానిర్దేశరలో ఇప్పటికే దేశంలో ఎక్కడా లేనివిధంగా నేతన్నల సంక్షేమం కోసం విభిన్న కార్యక్రమాలను చేపట్టినట్లు కేటీఆర్ వెల్లడించారు. నేతన్నలకు అత్యంత సులువుగా ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా అధికారులు తమ కార్యాచరణ కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా నేతన్నలకు అందిస్తున్న చేనేత మిత్ర లాంటి కార్యక్రమాల పురోగతిని అడిగి



తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అన్ని పథకాలు అత్యంత సులభంగా నేతన్నలకు అందేలా అవసరమైన మార్పులను నేతన్నల సూచనల మేరకు చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఈరోజు చేనేత రంగానికి ఎంతగానో భరోసా లభించిన విషయాన్ని ప్రస్తావించిన కేటీఆర్, చేనేత రంగంలోని నేతన్నల కళకు, వృత్తికి మరింత ఆదాయం వచ్చేలా తీసుకోవాల్సిన కార్యక్రమాలపైన అధ్యయనం చేయాలని అధికారులను కోరారు. చేనేత కార్మికులు అధికంగా ఉన్న నారాయణపేట, గద్వాల్, దుబ్బాక, కొడకండ్ల, మహాదేవపూర్, కొత్తకోట వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన పనులపైన అధికారులు క్షేత్రస్థాయిలో మరింత అధ్యయనం చేసి ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఒక కార్యాచరణ రూపొందించాలన్నారు. ఆగస్టు 7వ తేదీన నిర్వహించ బోయే జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఆ రంగంలోని అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్న నేతన్నలకు గుర్తింపునిచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హైదరాబాద్ నగరంలో చేనేత మ్యూజియాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఒకవైపు చేనేతల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను భారీ ఎత్తున కొనసాగిస్తూనే రాష్ట్రంలో ఉపాధి కోసం నేతన్నలు విస్తృతంగా ఆధారపడిన పవర్‌లూమ్ రంగం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైన కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఇందుకోసం దేశంలోనే అత్యంత ఆదర్శంగా ఉన్న తమిళనాడులోని తిర్పూర్ క్లస్టర్ మాదిరి ఒక సమీకృత పద్ధతిన, అత్యున్నత ప్రమాణాలతో కూడిన పవర్‌లూమ్ క్లస్టర్లను తెలంగాణలో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కేటీఆర్ అధికారులకు సూచించారు. ఇందుకోసం తిర్పూర్ క్లస్టర్‌లో పర్యటించి అక్కడ ఉన్న ఆదర్శ వంతమైన పద్ధతులను, అక్కడి నేతన్నలు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకున్న తీరు, వారు అనుసరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం (టెక్నాలజీ), జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా చేస్తున్న నేత ఉత్పత్తుల తయారీ వంటి అనేక అంశాల పైన విస్తృతంగా అధ్యయనం చేయాలని సూచించారు. తిర్పూర్ లాంటి పవర్‌లూమ్ క్లస్టర్ల స్ఫూర్తితో తెలంగాణలోనూ నేతన్నల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు, వారి ఆదాయాలను మరింత పెంచేందుకు అవసరమైన అన్ని కార్య క్రమాలను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన కార్యాచరణను వెంటనే ప్రతిపాదించాలని టెక్స్‌టైల్ శాఖ అధికారులకు మంత్రి కేటీఆర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో చేనేత, పవర్‌లూమ్ కార్పొరేషన్ల చైర్మన్లు ఎల్ రమణ, గూడురి ప్రవీణ్, టెక్స్‌టైల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం వెండి ధరలు

**ముంబై,ఏప్రిల్28,(ప్రజా మంటలు):** బంగారం ధర, వెండి ధరల్లో మార్పులు చేర్పులు సర్వసాధారణం. ప్రతిరోజూ మారుతూనే ఉంటాయి. తాజగా ధరలు ఎలా ఉన్నదన్నదే ముఖ్యం. శుక్రవారం మాత్రం బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ఏదో నామమాత్రపు తగ్గుదలే అయినా కూడా కాస్త ఊరటనిస్తుంది. కాబట్టి కొనుగోలుదారులకు ఒకరకంగా ఇది గుడ్ న్యూసేనని చెప్పాలి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం ధర తగ్గినా పెరిగినా కూడా కొనక తప్పదు. కానీ తగ్గితే కాస్త హ్యాపీగా కొనుగోలు చేస్తారు. తాజాగా బంగారం తులంపై రూ.220 వరకూ దిగి వచ్చింది. ఇక వెండి అయితే దీన్ని ఒక తగ్గడంగా కూడా పరిగణించకూడదు. కిలో వెండిపై కేవలం రూ.300 తగ్గింది. దేశంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.200 తగ్గి రూ.55,750కి చేరుకోగా.. 24 క్యారెట్ల బంగారంపై రూ.220 వరకూ తగ్గి రూ. 60,820కి చేరుకుంది. ఇక కిలో వెండి ధర రూ. 76,200గా ఉంది.

# రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

### గతేడాదిని మించి రెట్టింపు ధాన్యం సేకరణ
### అధికారులతో సమీక్షించిన మంత్రి గంగుల

**హైదరాబాద్,ఏప్రిల్28(ప్రజా మంటలు):** యాసంగి ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గతేడాది ఇదే సమయానికన్నా రెట్టింపును మించి కొనుగోళ్లు చేశామని ఆయన వెల్లడించారు. శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్ లో పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్, సంస్థ జీఎం రాజారెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో ధాన్యం కొనుగోళ్లపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఇదే రోజు 1.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా రెండున్నర రెట్లు అధికంగా నేడు 5.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసా మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంత ధాన్యం వచ్చిన కొనుగోలుకు వీలుగా 7142 కొనుగోలు కేంద్రాల(అ।నిబి।సబ)ను సైతం ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే 4వేలకు పైగా కేంద్రాలను ప్రారంభించామన్నారు. రోజుకు 90వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం సేకరణ పక్రియ చురుగ్గా కొనసాగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షాల నుంచి రక్షణగా టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు.

ప్యాడీ క్లీనర్లు సైతం 6,055, వెయింగ్ మిషన్లు 12,671, ఇతరత్రా మౌలిక సదుపాయాలనూ కల్పించామన్నారు. రైతులకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, యాసంగిలో అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు రైతులకు భరోసా కల్పించి కేంద్రం నుంచి బాయిల్డ్ రైస్ కు సానుకూలంగా నిర్ణయం ఇప్పించాలని సూచించారు, తడిసిన ధాన్యం విషయంలో కేంద్రం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.



# బిజెపి పార్టీలో చేరికలు

**కాటారం 28 ఏప్రిల్ (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోనీ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు బిజెపి రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది బిజెపి పార్టీలో చేరారు. పలువురు మాట్లాడుతూ.... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి



సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మంథని ప్రాంతంలో మార్పు తీసుకురావాలని లక్ష్యంతో సునీల్ రెడ్డి నాయకత్వంలో పనిచేయాలనే ఆకాంక్షతో పార్టీలో చేరుతున్నట్టు వారు వెల్లడించారు. అనంతరం సునీల్ రెడ్డి మాట్లాడుతూ.... మంథని ప్రాంతంలో బిజెపి పార్టీ రోజు రోజుకి బలపడుతుంది కాబట్టే బిఆర్ఎస్ కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుకు చెందారు. కనుక ఒక్కసారి బిజెపి పార్టీకి అవకాశం ఇవ్వండి అని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్ కాటారం మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూసల రాజేంద్రప్రసాద్, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి బోయినీ నారాయణ, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, నగరేశ్వర, శ్రీ సీతా రామచంద్ర స్వామి ప్రతిష్ఠా మహోత్సవం

**జనగామ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జనగామలోని వైశ్య భవన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించుకున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, నగరేశ్వర, శ్రీ సీతా రామచంద్ర స్వామి ప్రతిష్ఠా మహోత్సవ సందర్భంగా రెండవ రోజున వాస్తు



హోమం శాంతి హోమం వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో జనగామ ప్రముఖ సిద్ధాంతి కృష్ణమాచారి, జనగామ ప్రముఖ వేద పురోహితులు అప్పయ్య శాస్త్రి, జనగామ లోని వేద పండితులు పురోహితులు ఆధ్వర్యంలో జనగామ లోని పెద్ద మొత్తంలో వైశ్య కుటుంబాలు పాల్గొని అంగరంగ వైభవంగా హోమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంను వాసవీ కన్యకా పరమేశ్వరి సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వాస్తు హోమం శాంతి హోమం ద్వారా జనగామ లోని ప్రజలందరికీ శాంతి జరిగి అందరూ ఆరోగ్యంగా ఐశ్వర్యము పొందాలని కోరుతూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పజ్జూరి గోపయ్య, కార్యదర్శి బుద్ధ రమేష్, కోశాధికారి రామిని రాజేశ్వర్ పాల్గొన్నారు.


## ఆర్య వీర్ దళ్ శిక్షణార్థులతో
# నేడు శోభాయాత్ర

**సికింద్రాబాద్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** ఆర్యవీర్ దళ్ తెలంగాణ, ఆర్యసమాజం మేడిబావి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22 ఏప్రిల్ నుండి జరుగుతున్న యువక నిర్మాణ శిభిరంలో భాగంగా నేడు శనివారం శిభిరార్థుల శోభాయాత్ర ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆర్య వీర్ దళ్ ప్రాంతీయ సంచాలకులు డా. ధర్మతేజ, ఆర్య సమాజ్ ప్రెసిడెంట్ ఎం.ఆర్. రవీందర్ తెలిపారు. మేడిబావి వ్యాస్ నగర్ లోని ఆర్య సమాజ్ నుంచి సాయంత్రం 4.30 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 30 ఆదివారం సాయంత్రం ఆర్య సమాజ్ లో యువక నిర్మాణ శిక్షణా శిభిరం ముగింపు ఉత్సవం ఉంటుందన్నారు. ఇందులో శిభిరార్థుల పలు అద్భుత ప్రదర్శనలు ఉంటాయన్నారు. ముగింపు వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.



## జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరేషన్ చేయాలని నిరవధిక సమ్మె

**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని అన్ని గ్రామాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ నాలుగు సంవత్సరాలు ప్రొఫెషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్నందున, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు




పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులేషన్ చేస్తూ పనిచేసిన నాలుగు సంవత్సరాల కాలాన్ని సర్వీస్ గా పరిగణించాలని ఓపిఎస్ లను జేపీఎస్లుగా మార్చుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ, మండల పరిషత్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేపట్టారు. ఇట్టి సమ్మె యందు మండలంలోని పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అందరూ పాల్గొన్నారు.

## జూనియర్ పంచాయితీ సెక్రటరీల నిరవధిక సమ్మె

**తరిగొప్పుల ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** మండల కేంద్రంలో జిపిఎస్ మరియు ఓ పి ఎస్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులరైజేషన్ కోసం శాంతి యుతంగా నిరవధిక



సమ్మె ప్రారంభించరు. ఈ సమ్మెకు ఎంపీడీవో జై రావు, ఎంపీఓ మిస్బ అలం, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి మండల కంప్యూటర్ ఆపరేటర్ సందీప్ శ్వేత మండల కార్యాలయం అధికారులు రత్నాకర్ రెడ్డి యాదగిరి ఆంజనేయులు ఈ సమ్మెకు హాజరై సంపూర్ణ మద్దతు తెలిపారు.

# బాలల పరిరక్షణకు అవగాహన సదస్సులు

- **జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్**

**ఎల్కతుర్తి ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలో బాలల పరిరక్షణకు విడతలవారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం అనంతరం మండల బాలల పరిరక్షణ బలోపేతంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం ఎంపిపి మేకల స్వప్న అధ్యక్షతన జరిగింది, శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుదీర్కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామం బాలల స్నేహపూర్వక గ్రామంగా మారాలని, బాల్యవివాహ రహిత గ్రామాలుగా నిలవాలని ఆకాంక్షించారు, నిరుపేద బాలబాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిందని అట్టి సదుపాయాలను ఉపయోగించుకోవాలని కోరారు, సమస్యాత్మక గ్రామాలపై కమిటీలు దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపిపి మేకల స్వప్న మాట్లాడుతూ బాలల పరిరక్షణ కమిటీలు ఎంత చురుగ్గా ఉంటే ఆయా గ్రామాల్లో బాలల జీవితం అంత మెరుగ్గా ఉంటుందని, గ్రామ, డివిజన్, మండల స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేయాలని, బాలల రక్షణ సంరక్షణలో కమిటీల పాత్ర కీలకమైనదనీ అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం సబిత మాట్లాడుతూ.... జిల్లాలోని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశామని, విడతల వారీగా కమిటీలను బలోపేతం చేస్తూ బాలల పరిరక్షణకు కృషి చేస్తున్నామని, అందరి సహకారంతో బాలల స్నేహ పూర్వక సమాజ ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అన్నారు. బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ కే శిరీష మాట్లాడుతూ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో బాల బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని కమిటీ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో బాల్య వివాహాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ముందస్తు సమాచారం తెలుసుకొని బాల్య వివాహాల నిలుపుదలకు క్రియాశీలకంగా పనిచేయాలనిఅన్నారు. సిడిపివో పి. స్వరూప మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా బాల్య వివాహాలను చేసుకొనేవారిపై, ప్రోత్సహించే వారిపై బాల్య వివాహ నిరోధక అధికారుల దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.పిల్లలు లేని దంపతులు చట్ట బద్ధ దత్తత కోసం సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ కమిటీ నియమ నిబంధనలకు సంబంధించిన కరదీపికలను జిల్లా పరిషత్ చైర్మన్ మరియు తహసిల్దార్ రవీందర్ రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు



కజాంపురం దామోదర్, ఎంపిపి చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగినది, కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ బి. పద్మ, బాలల పరిరక్షణ అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్,చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ రాగి కృష్ణ మూర్తి, ఐసిపిఎస్ సోషల్ వర్కర్ జీ. సునీత, టీమ్ మెంబర్ బి. రమేష్, తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ కోసం 15 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. మండల బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ గా ఎంపిపి మేకల స్వప్న కార్యదర్శిగా ఎంపిడివో టీ. సునీత, కన్వీనర్ గా భీమదేవరపల్లి సిడిపివో పి. స్వరూప, సభ్యులుగా ఎంఈవో ఈ. రవీందర్, చైల్డ్ లైన్ ప్రతినిదులుగా రాగి కృష మూర్తి, బి. రమేష్, మండల వైద్యాధికారి సయ్యద్ ఇక్తార్ అహ్మద్, ఎస్ఐ జె పరమేష్, సహాయ కార్మిక అధికారి చాణక్య, కిషోర బాలుడు, బాలికలుగా డీ వేణు, ఏ శ్రీజ, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఏ వసంత, బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధి జీ సునీత, యువజన సంఘం నాయకులు ఏ ప్రశాంత్, మరియు సర్పంచులు సిహెచ్ వసంత, ఏ భాగ్యలక్ష్మి తదితరులతో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# పీపుల్స్ మార్చ్ పాదయాత్ర

- **సీఎల్పీ నేత మల్లు బట్టి విక్రమార్క**

**తరిగొప్పుల ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** సీఎల్పీ నేత మల్లు బట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా జనగామ జిల్లాలో ని స్టేషన్ఘన్ నియోజకవర్గం సిరిపూర్ మండలంలోని కొమ్ము గుట్ట లింగం నియోజకవర్గం తరిగొప్పుల మండలం లోని అబ్దుల్ నాగారం గ్రామంలో రచ్చబండలో ఈ సందర్భంగా మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రానికే తలమానంగా ఉండేలా నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న డాక్టర్ రాజశేఖర్ రెడ్డిగారు.. అవుటర్ రింగ్ రోడ్డు, ఇంటర్నేషల్ ఎయిర్ పోర్టు తీసకువచ్చారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోని టీఆర్ఎస్ ప్రభుత్వం అవుటర్ రింగు రోడ్డును 30 ఏళ్లపాటు టోల్ వసూలు చేసుకేందుకు ఒక పకరవేట్ కంపెనీతో అగ్రిమెంట్ చేసుకుందని పత్రికల్లో వచ్చింది. వీళ్లను ఎన్నుకున్నదే ఐదేళ్ల కోసం. అది కూడా పాలించడానికే తప్ప భూములు అమ్ముకోవడానికి, గత ప్రభుత్వాలు ప్రజల కోసం నిర్మించిన ఆస్తులను , సంస్థలను వ్యవస్థలను దశాబ్దాలపాటు లీజుకు ఇవ్వడానికో అమ్ముకోవడానికో కానేకాదు. తెలంగాణ రాష్ట్రాన్ని కుదవపెట్టి.. ఇప్పటికే కేసీఆర్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్లు అప్పులు చేసింది. మోయలేనంత భారాన్ని ప్రజలపై వేసింది. అపారమైన వనరులు, అద్భుతంగా వస్తున్న పన్నులతో అభివృద్ధ చేసుకునే అవకాశం ఉన్నా.. మిగులు బడ్జెట్ ను నాశనం చేసి, రూ. 5 లక్షల కోట్లు అప్పులు చేసి, అది సరిపోక రింగ్ రోడ్డును టోల్ వసూలు చేసుకునేందుకు ఒక ప్రవేట్ కంపెనీకి అగ్రిమెంట్ చేసుకున్నావు. ఆ 30 ఏళ్ల టోల్ మొత్తాన్ని ఇప్పుడే ఈయన వసూలు చేసుకుని ప్రజల ఆస్తిని నాశనం చేస్తున్నాడు. ప్రభుత్వం వసూలు చేయాల్సిన పన్నులను ఒక అదానీకో, అంబానీకొ రబోయె 30 ఏళ్లకు తెలంగాణ పన్నుల వసూలు చేసుకొమ్మని అగ్రిమెంట్ చేసుకుని.. ఆ డబ్బులు ఇప్పుడే నాకు కట్టండని చేస్తే ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో ఇదీ అలాగే ఉంది. రాష్ట్రాన్ని అమ్మకానికి పెట్టిన దుర్మార్గ పాలన. తెలంగాణ ప్రభుత్వం అందినకాడికి అమ్మేసే ప్రయత్నం చేస్తోంది. హైదరాబాద్ లో ఉన్న భూములను అమ్ముతున్నారు. చివరకు గత ప్రభుత్వాలు పేదలకు అసైండ్ చేసిన భూములను వదలడం లేదు. ఇంతటి దోపిడీ స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ, ఎక్కడా లేదు. కేటీఆర్ ను నేను సూటిగా అడుగుతున్నాను. గత 70 ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏమీ చేయలేదని అంటున్నావు. దేశాన్ని తెలంగాణ మోడల్ తో అద్భుతంగా పాలన చేస్తామని అంటున్నావు.. అసలు తెలంగాణ మోడల్ అంటే లిక్కర్, కాళేశ్వరం, భగీరథ, మిషన్ కాకతీయ స్కాములు, హైదరాబాద్ భూముల అమ్మకం, అవుటర్ రింగురోడ్డు 30 ఏళ్లకు లీజుకు ఇవ్వడం, రూ. 5 లక్షల కోట్లు అప్పులు చేయడం, మద్యం అమ్మకాలు



రూ.36 వేల కోట్లకు పెంచడం ఇదే మీరు చెప్పే తెలంగాణ మోడల్ అంటే. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏమీ చేయకపోతే 30 ఏళ్లకు లీజుకు ఇచ్చిన అవుటర్ రింగ్ రోడ్డు, ఇంటర్నేషలన్ ఎయిర్ పోర్టు, హైదరాబాద్ చుట్టూ స్థాపించిన పరిశ్రమలు, తెలంగాణ రాష్ట్రంలో పారుతున్న నీళ్లు, ఎస్సారెస్పీ, కడెం, దేవాదుల ఎత్తిపోతల పథకం, శ్రీపాద ఎల్లంపల్లి, జూరాల, నెట్టెంపాడు, కోయల్ సాగర్, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ శ్రీశైలం, నాగార్జున సాగర్, భీమా సాహా అనేక ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. ఈ పదేళ్లో కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యం మాత్రమే. ఈ రోజు రాష్ట్రంలో 15 వేల మెగావాట్ల విద్యుత్ అవసరమైతే. ఆ మేరకు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అందించిపెట్టించింది కాంగ్రెస్ మాత్రమే. నీళ్ల కోసం ఈ రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. రెండు జీవనదుల మధ్య దెక్కన్ పీఠభూమిగా మనది. గోదావరి మీద మీరుమొదలు పెట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి ఎక్కడైనా ఒక్క ఎకరానికి నీళ్లు పారిస్తున్నారా? క్రిష్ణానది మీద మీరు మొదలు పెట్టింది పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు. ఇంతవరకూ ఒక్క చుక్క నీళ్లు పంపు చేసేందుకు ఒక మొటార్ కూడా పెట్టలేదు. నీళ్ల కోసం తెచ్చుకున్న తెలంగాణలో అటు గోదావరి, ఇటు క్రిష్ణ నీళ్లు కూడా తీసుకురాలేదు. దశాబ్ద కాలంలో రాష్ట్రంలో ఒక్క బీహెచ్ఈఎల్ వంటి పరిశ్రమ తీసుకురాలేదు. మాజీ టీపీసీసీ సభ్యుడు పొన్నాల లక్ష్మయ్య, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ ధన్వంతి, మాజీ పార్లమెంట్ సభ్యుడు రాజయ్య, మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులను
# ప్రభుత్వం పర్మినెంట్ చేయాలి

- **సమ్మెకు సంఘీభావంగా బీసీ నాయకులు**

**జగిత్యాల ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018 లో నోటిఫికేషన్ ఇచ్చి రిక్రూట్మెంట్ చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల మండల కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చింతల గంగాధర్ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... 2019 ఏప్రిల్లో విధులలో చేరిన పంచాయతీ కార్యదర్శులను మూడు సంవత్సరాల కాలం తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ఆదేశాలను శిరసావహించి విధులు నిర్వహించిన కార్యదర్శులను అదనంగా మరో సంవత్సర కాలం అలాగే విధులు నిర్వర్తించారని ఆదేశించారు. ఈ సంవత్సర కాలం కూడా పూర్తయ్యింది. ఐనా ప్రభుత్వం మాత్రం ఎటువంటి ప్రకటన చేయకపోవడం తో పంచాయతీ కార్యదర్శులు వారి న్యాయబద్ధమైన డిమాండ్లతో సమ్మె కు దిగడం సమంజసమేనని వారు అన్నారు. ఇకనైనా ప్రభుత్వం దిగివచ్చి పంచాయతీ కార్యదర్శులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వారి న్యాయబద్ధమైన డిమాండ్లను



పరిష్కరించాలని ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చింతల గంగాధర్, ఎలిగేటి సంతోష్, సిహెచ్ రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ మధురిమలు

(కవిత)

అర్థంలేని చదువు
డబ్బు లేని జీవితం
కిటికీలు లేని ఇల్లు
దయ్యాల కొంప లాంటిది
కష్టపడి చదువద్దు
ఇష్టపడి చదువాలి
క్రింద పడిపోయిన
కెరటం లాగా లేవాలి
అహంకారం వద్దు
నమ్రత ముద్దు
అమర్యాద వద్దు
మర్యాద ముద్దు
శిక్షణ శిక్ష కాకూడదు
రక్షణ భక్షణ కాకూడదు
రోగం బాధ కాకూడదు
వేదన రోదన కాకూడదు
మధుర స్వరం మూగబోయే
మహాపురుషుడు నింగికేగే
మహానుభావుడు కానరాడు
సంగీత జగత్తు కుంగిపోయే



రచన:
రేణుకుంట్ల మురళి,
కవి, గాయకులు, రచయిత
ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ పోయట్,
రైటర్,ఆథర్
చరవాణి: 8106384104

## పేద కుటుంబాలకు బొమ్మ శ్రీరామన్న అండ

**ఎల్కతుర్తి ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన జంపాల లింగయ్య మరణించగా, అతని కుటుంబ సభ్యులకు, రాష్ట్ర మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపి నాయకులు బొమ్మ శ్రీరాం చక్రవర్తి



అండగా ఉంటాను అని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా "బొమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50. కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెరుగు మధుసూదన్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గొడిశాల వినయ్, దండ దేవేందర్ రెడ్డి, కొమ్మిడి శ్రావణ్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు అల్లి కుమార్, కడారి అశోక్, కడారి సురేందర్, గోడిశాల అర్జున్, జంపాల శ్రీకాంత్, సంజయ్ బొమ్మ ఫౌండేషన్ సభ్యులు తదితులున్నారు.

## ఏఐఎస్‌బి ఆధ్వర్యంలో
# రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం


చిగురుమామిడి ఏప్రిల్ 28 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలలోని సమస్యలను పరిష్కరించి శాశ్వత పరిష్కారం చూపాలని




ఏఐఎస్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేసి అనంతరం మాట్లాడుతూ.... రాష్ట్రంలో రోజు రోజుకి ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో దాదాపుగా నాలుగు వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయని వాటిని తక్షణమే విడుదల చేసి విద్యార్థులను కళాశాల యాజమాన్యాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు అంతే కాకుండా విద్యాసంవత్సరం ప్రారంభం ముందే అన్ని మౌళిక వసతులు కల్పించాలని కోరారు విద్యారంగంపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ విచారణలో కాలయాపన చేయడం పద్ధతి కాదని భవిష్యత్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బి రాష్ట్ర కార్యదర్శి మొలుగూరి హరికృష్ణ ఏఐఎస్‌బి, జిల్లా నాయకులు కాశపాక వినోద్,రమేష్ యాదవ్,మొలుగూరి అరుణ్ తేజ,శ్రీధర్,అజయ్, విశాల్, పవన్,అజయ్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ. 30,000. తక్షణ సహాయం అందించాలి

**జనగామ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** ఇటీవల కురిసిన వడగండ్ల వానకు తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి 30,000 రూపాయల తక్షణ సహాయం అందించాలని తెలంగాణ నవ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యాసారపు కర్ణాకర్ డిమాండ్ చేశారు. జనగామ మండలం చౌడారం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కరుణాకర్ రైతులు ఆరుగాలం



పండించి పంట చేతికొచ్చే సమయానికి ఆకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలకు తోడు ఫర్టిలైజర్ల ధరలు, కూలీల ధరలు పెరగడంతో పెట్టుబడి తడిసి మోపెడు అవుతుందని అన్నారు. ప వ్యవసాయరంగం తీవ్రంగా సంక్షోభంలో పడిపోయిందని అన్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు ఎకరానికి 10000 చొప్పున ఇస్తానన్న ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఒక రూపాయి కూడా ఇవ్వలేదని ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని లేకుంటే రైతులు బిఆర్ఎస్ పార్టీని ఆదరించరనీ ఇప్పటికే పంట రుణాలను మాఫీ చేయలేదని లక్ష రూపాయలు మాఫీ చేస్తా అన్న ముఖ్యమంత్రి ఇప్పటివరకు కనీసం 50 వేల రూపాయలు కూడా మాఫీ చేయలేదని ఆరోపించారు.

## అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో 137వ మేడే ను విజయవంతం చేయాలి

**జనగామ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో 137వ మేడే ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం గబ్బెట్ట గోపాల్ రెడ్డి భవనంలో జనగామ జిల్లా ఏఐటీయూసీ సమితి సమావేశం చామకూర



యాకుబ్ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిధిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ 1886 సంవత్సరంలో చికాగోలో కార్మికుల తిరుగుబాటులో వేల మంది అమర వీరుల త్యాగాలతో మేడే ఏర్పాటైందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులపై ఆంక్షలు వేధిస్తూ పెట్టుబడి దారులకు కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను చేస్తున్నారని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నారని, కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిత్యావసర వస్తువులపై ధరలు పెంచుతున్నారని ఆరోపించారు. ఈ మేడే ను భవన నిర్మాణ కార్మికులు ,హమాలీ ,బీడీ,ఆటో కార్మికులు , ఆర్టీసీ వివిద రంగాల కార్మికులు జిల్లా వ్యాప్తంగా జెండా కార్యక్రమాలు ఊరేగింపు కార్యక్రమాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశములో మోతె శ్రీశైలం, గుడెల్లి రాజు, బుడిగె వీరస్వామి, దాయ నగేష్, లింగాల రాములు, అది సాయన్న, గోలకొండ నాగరాజు, బంగారుగాల్ల అనిత, జయ యాదగిరి, ఎర్ర సాంబరాజు, మరిక్కుకాల సాయిలు, ముల్కల లక్ష్మయ్య, గొడ్డేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలి

**కోరుట్ల టౌన్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఇండ్ల స్థలాలు ఇప్పించాలని సిపిఎం రాష్ట్ర కమీటీ సభ్యులు లెల్లెల బాల కృష్ణ కోరారు. కోరుట్ల పట్టణం లోని సంగెం వాగు సమీపంలో ని జంబి గద్దె వద్ద గత 19రోజులుగా పేదల ఇండ్ల స్థలాల ఉద్యమం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆ స్థలంలో వేసిన గుడిసెలను అత్యుత్సాహంతో రెవెన్యూ సిబ్బంది నిన్న రాత్రి తొలగించారని ఇప్పటికి మూడు సార్లు వేసుకొన్న గుడిసెలను తగులబెట్టారణి



రెవిన్యూ సిబ్బంది చర్యలను సిపిఎం రాష్ట్ర కమీటీ తీవ్రంగా ఖండిస్తున్నదని పాలకులకు, రెవిన్యూ సిబ్బందికి ఏ మాత్రం చిత్త శుద్ధి ఉన్నా ముందుగా వెటర్నరీ కాలేజ్ వద్ద 100 ఎకరాల స్థలాన్ని, మద్దుల చెరువు వద్ద ఉన్న స్థలాలను కబ్జా చేసినారు. కోరట్ల బస్టాండ్ వద్ద గల హనుమాన్ వ్యాయామ శాల మరియు గడి బురుజు వద్ద 50ఎకరాల భూములను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ అందులో నిర్మాణాలు చేశారని ఇవేవి పాలకులకు, అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎస్సి, ఎస్టి, మైనారిటీ పెదవర్గాలవారు గుడిసెలు వేసుకుంటే రాత్రి కి రాత్రి వాటిని తొలగించారని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేదలకు ఇండ్లు ఇస్తామని ఎన్నికల సమయం లో హామీ ఇచ్చారని ఆ హామీలు ఇప్పుడు ఏమయ్యాయని దుయ్య బట్టారు. రాష్ట్రములో 50చోట్ల ఇండ్ల స్థలాల పోరాటం చేస్తున్నామని ఇప్పటి కైనా స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని పేదలకు న్యాయం చేయాలని లేనిచో ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కన్వీనర్ జి. తిరుపతి నాయక్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, అంబేద్కర్ ఇండ్ల స్థలాల పోరాట కమీటీ కన్వీనర్ గుమ్మడి రమేష్ మరియు కమీటీ సభ్యులు రియానా, శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో బీసీల బలోపేతానికి కృషి చేయాలని ఆర్. కృష్ణయ్యకు వినతి

**బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శికారి గోపికృష్ణ**

**కోరుట్ల టౌన్ కోరుట్ల టౌన్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లాలో బీసీల బలోపేతానికి కృషి చేయాలని హైదరాబాద్ లోని విద్యానగర్ బిసి భవన్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బీసీల ముద్దుబిడ్డ రాజ్యసభ



సభ్యుడు ఆర్ కృష్ణయ్య అని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి షికారి గోపికృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆర్ కృష్ణయ్య ను శాల్వలతో ఘనంగా సన్మానించారు.అనంతరం శికారి గోపికృష్ణ మాట్లాడుతూ.... జగిత్యాల జిల్లా బిసి బలోపేతానికి కృషి చేయాలని కోరారు. 70 శాతానికి పైగా ఉన్న బీసీలకు సరైన గుర్తింపు దక్కడం లేదని, స్వాతంత్రం వచ్చినప్పటికీ బీసీ లకు సరియైన గుర్తింపు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీ సీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపల్లి రాజేంద్రప్రసాద్, బీసీ యువజన సంఘం నాయకులు అల్లే జగదీశ్వర్, అనంతయ్య పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో వరి ధాన్యమును పరిశీలిస్తున్న అడ్లూరి

- తడిసిన వరి ధాన్యమును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- డీసిసి అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**గొల్లపల్లి ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యంను ఏలాంటి కోతలు లేకుండా మద్దతు ధరను చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డీసిసి అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యమును ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధిత రైతులను పరామర్శించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలకు వరి ధాన్యమును విక్రయించేందుకు రైతులు నానాపాట్లు పడి కేంద్రాల్లో వరి ధాన్యంను నిలువ చేసి రోజుల తరబడి పడిగాపులు పడుతున్నా సంబంధిత అధికారులు పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సమంజసం కాదని పేర్కొన్నారు గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు దుస్థితే ఇలాగ ఉంటే గ్రామాల్లోని ఐకెపి కేంద్రాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు అన్నారు. రైతు పక్షపాతి అంటూ ఊక దంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే తప్ప వరి ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి గూర్చి మెరుగైన చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదని ఆరోపించారు. నెల రోజులు కావస్తున్న ఇప్పటికీ పలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యం కొనుగోళ్లు రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని లేకుంటే రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపెల్లీ సర్పంచ్ ముస్కు నీ శాంత్ రెడ్డి, సర్పంచులు గంగాధర్, రేవెళ్ళ సత్యనారాయణ గౌడ్ , ఎంపీటీసీ లంభ ధనవ్వలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**గల్ఫ్ నుండి వచ్చిన మృతదేహం....**

**అంత్యక్రియల్లో పాల్గొన్న అడ్లురి లక్ష్మణ్ కుమార్:**



గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఓరగంటి రాజయ్య అనే గల్ఫ్ వలస కార్మికుడు మస్కట్ లో మృతిచెందగా శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది ఈ సందర్భంగా ఈ సందర్భంగా గల్ఫ్ మృతుడి అంత్య క్రియల్లో లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## జగిత్యాల డాక్టర్ల నిర్లక్ష్యం

- బలి అవుతున్న మహిళల ప్రాణాలు
- జాతీయ మానవ హక్కుల కమీషన్‌కు పిర్యాదు

**జగిత్యాల ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** ప్రభుత్వ డాక్టర్ల నిర్లక్ష్యంతో ఆపరేషన్లు వికటించి జగిత్యాలలో జరిగిన పలువురు బాలింతల మరణం, కడుపులో గుడ్డ పేలుకలు మరిచిన సంఘటన పై శుక్రవారం జాతీయ మానవ హక్కుల మండలి అనే స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో జాతీయ మానవ హక్కుల కమీషన్ కు పిర్యాదు చేసారు. జాతీయ మానవహక్కుల మండలి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ అయిల్నేని శ్రీనివాసరావు ఆదేశాలతో జగిత్యాల జిల్లా అధ్యక్షులు నక్క గంగారాం అధ్వర్యంలో యూత్ వింగ్ సభ్యులు, మహిళా వింగ్ సభ్యులు ఈఫిర్యాదు చేశారు. జగిత్యాల మాతా శిశు సంక్షేమ ఆసుపత్రిలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వలన గత ఆరు నెలలు గా జరిగిన ఆపరేషన్స్ వికటించి పలువురు బాలింతలు మరాణించారు. అలాగే ఈ మధ్యకాలంలో మరో మహిళ ఆపరేషన్ సమయంలో కడుపులో గుడ్డ పేలికలు మరిచిపోయిన సంఘటన సంచలనం రేకెత్తించింది. ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని శుక్రవారం జాతీయ మానవ హక్కుల కమీషన్ కు, జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ బి. ఎస్. లత కు పిర్యాదు చేశారు. సరైన విచారణ జరిపించి బాధ్యులైన వైద్యులు, సిబ్బంది పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బాధిత కుటుంబీకులను అన్ని రకాలుగా ప్రభుత్వమే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. జాతీయ మహిళా కమీషన్ న్యూ ఢిల్లీ వారికీ, జాతీయ మానవ హక్కుల కమీషన్ న్యూ ఢిల్లీ వారికి, రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్, ఆరోగ్య శాఖ మంత్రి లకు కూడా ఫిర్యాదులను ఈ



మెయిల్, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పిర్యాదు చేసినట్లు జిల్లా అధ్యక్షులు నక్క గంగారాం తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కొక్కుల ప్రభాకర్, కో-కన్వీనర్ రవీందర్, సహాయ కార్యదర్శి కలకుంట్ల రాం ప్రసాద్, గంగం జలజ, పాత రాణి, శైలజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అందివచ్చిన అవకాశాలతో ముందడుగు వేయాలి

- క్యాట్ ఆధ్వర్యంలో జస్టిస్ కు ఘన సన్మానం

**సికింద్రాబాద్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** అవకాశాలు అనేవి నేరుగా మన దగ్గరకు రావని, మనమే కష్టపడి, దృడసంకల్పంతో వాటిని అందుకొని ముందడుగు వేయాలని హైకోర్టు జడ్జి జస్టిస్ పి.మాధవిదేవి అన్నారు. హైకోర్టు జడ్జి జస్టిస్ పి.మాధవిదేవి ని క్యాట్ ఆధ్వర్యంలో కవాడిగూడ సీజీవో టవర్స్ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తాను మధ్య తరగతి కుటుంబాల్లోని సాధక బాదకాలు చూశానన్నారు. పుస్తక పఠనంతో పాటు చర్చించుకోవడం (డిస్కషన్ ) ద్వారా విషయ పరిజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. అడ్వకేట్లు




కోర్టులో తమ కేసులను వాదించే ముందు ఇంటి వద్దే హోం వర్క్ చేసి రావాలని, ఒక కేసు ఓడిపోయినంత మాత్రాన నిరాశ పడకుండా తదుపరి కేసులపై దృష్టి సారించాలన్నారు. ఒక మహిళ ఉన్నతస్థాయికి ఎదగడానికి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. చిన్నప్పటి నుంచి కష్టపడి, ప్రణాళిక బద్ధంగా చదివిన చదువు మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని, తద్వారా తాము నలుగురిని ఆదుకునే అవకాశం కలుగుతుందని క్యాట్ (సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యూనల్ అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ) ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా క్యాట్ సీనియర్ అడ్వకేట్స్ మాట్లాడుతూ..క్రమశిక్షణ అలవర్చుకొని ఎంతో కష్టపడి అంచెలంచెలుగా అడ్వకేట్ స్థాయి నుంచి హైకోర్టు జడ్జి వరకు ఎదిగిన పి.మాధవిదేవి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ టి.హనుమంత రెడ్డి, క్యాట్ మెంబర్ బీ.ఆనంద్, జ్యూడిషల్ మెంబర్ సుది రంజన్ మిశ్రా, అకౌంటెంట్ మెంబర్ రమాకాంత్ పాండే, ఐటీఏటీ మెంబర్ లలిత్, సీనియర్ అడ్వకేట్ కె. వెంకటేశ్వర్ రావు, క్యాట్ కౌన్సిల్ సీనియర్ కె. రజిత, క్యాట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘు కుమార్, సెక్రటరీ వి. వేణుమాదవ స్వామి, ట్రెజరర్ ఏ.సురేందర్ రెడ్డి, క్యాట్ అడ్వకేట్లు హాజరయ్యారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ బాలకృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ గాయత్రి పాల్గొన్నారు.

## ఒకే తేదీన కాకుండా నాలుగు పరీక్షలను విడివిడిగా నిర్వహించాలి

**జగిత్యాల ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** ఈనెల ఏప్రిల్ 30వ తేదీన ఒకేరోజు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన కానిస్టేబుల్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్, జూనియర్ లైన్ మేన్ మరియు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పరీక్షలను ఒకే తేదీన నిర్వహించాలని నిర్ణయించడం హాస్యాస్పదంగా ఉందని, అలాంటప్పుడు నోటిఫికేషన్ కూడా ఉమ్మడిగా ఇచ్చి ఉండాలని, దరఖాస్తులు కూడా ఏదైనా ఒక్క ఉద్యోగానికే చేయాలని నిర్ణయిస్తే బాగుండేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ఎద్దేవా చేశారు. ఈ ప్రక్రియ నాలుగు పరీక్షలకు అప్లై చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఇబ్బందిగా మారిందని, అసలే ఉద్యోగ నోటిఫికేషన్లు రాక, మరోవైపు నిర్వహించిన టీఎస్పీఎస్సీ పరీక్షా పేపర్ లీకేజీతో నిరుద్యోగ యువత పరిస్థితి అగమ్యగోచరంగా మారి ఏం తేల్చుకోవాలో తెలియని పరిస్థితుల్లో నిరుద్యోగ యువత ఉన్నదని, ఇటువంటి పరిస్థితులలో ఈనెల ఏప్రిల్ 30వ తేదీన ఒకేరోజు నాలుగు డిపార్ట్మెంట్లకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తామని ఏది ముఖ్యమో ఆ పరీక్ష మాత్రమే రాయాలని అధికారులు అనడం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. ఒకేరోజున వివిధ పరీక్షలు నిర్వహించాలనుకోవడం రాష్ట్రంలో ఉన్నతాధికారుల సమన్వయ లోపానికి నిదర్శనమని, సంవత్సరాల



తరబడి నిరుద్యోగ యువత కోచింగ్ సెంటర్ల వెంట తిరుగుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి పోటీ పరీక్షలకు సన్నదమైన తరుణంలో వివిధ డిపార్ట్మెంట్ల పరీక్షలన్నీ ఒకే తేదీన నిర్వహిస్తామని ప్రకటించడం, ఏది ముఖ్యమో తేల్చుకొని అదే రాయాలని అధికారులనడం సిగ్గుచేటని రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చింతల గంగాధర్ అన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడే విధంగా ప్రవర్తిస్తే ప్రజావ్యతిరేకతను చవిచూడటం తప్పదని ఆయనన్నారు. కాబట్టి వెంటనే రేపు నిర్వహించ తలపెట్టిన నాలుగు పరీక్షలను రద్దు చేసి విడివిడిగా తేదీలు నిర్ణయించి నిర్వహించాలని లేనిపక్షంలో యువతరాన్ని ఏకం చేసి ఉద్యమించడం తప్పదని హెచ్చరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో అలిశెట్టి ఈశ్వరయ్య, కొక్కు గంగాధర్, తిరుపురం రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లా యూత్‌లో నర్మెట మండల, హన్మకొండ జిల్లా ఇంచార్జిల నియామకాలు


**జనగామ ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** పల్లా యూత్ లో జనగామ, హన్మకొండ జిల్లా ఇంచార్జిలను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు



కొయ్యడ రవి శుక్రవారం ఉత్తర్వులు జారి చేశారు. జనగామ జిల్లావాసి ఎర్రవెల్లి బాబును నర్మెట మండల ఇన్చార్జిగాను అలాగే హనుమకొండ జిల్లా ఇన్చార్జిగా ఆరెందుల అనిల్ రాజు ను నియమించారు. తమపై ఉన్న నమ్మకంతో ఉన్నతమైన పదవులు ఇచ్చిన ఎం.ఎల్.సి పల్లా రాజేశ్వర్ రెడ్డికి పల్లా యూత్ అధ్యక్షులు కొయ్యడ రవికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఈనెల 30న సర్దార్ పటేల్ కాలేజీ వార్షికోత్సవ వేడుకలు

సికింద్రాబాద్ ఏప్రిల్ 28 (ప్రజామంటలు): సికింద్రాబాద్ పద్మారావునగర్ లోని సర్దార్ పటేల్ డిగ్రీ, పీజీ కాలేజీ వార్షికోత్సవం ఈనెల 30 ఆదివారం



నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. హేమలత తెలిపారు. హాకీ ఇండియా మాజీ కోచ్ నరేందర్ పాల్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. వార్షికోత్సవ వేడుకల సందర్బంగా కాలేజీ స్టూడెంట్స్ వివిధ కల్చరల్ ప్రొగ్రామ్స్ ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

## చెప్యాల అంగన్వాడి కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య దినోత్సవ వార్షికోత్సవ వేడుకలు

**కొడిమ్యాల ఏప్రిల్ 28 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామం లోని అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవ వేడుకలను ఐసిడిఎస్ మల్యాల ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో



ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గత సంవత్సరం అంగన్వాడి సెంటర్లో జరిగిన ప్రీ స్కూల్ పిల్లల కార్యక్రమాలను పిల్లల చేత చేసి చూపించి పిల్లల మనోవికాస అభివృద్ధికై పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ఎంపిటిసి మల్లారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్. సుధారాణి అంగన్వాడీ టీచర్లు ఎం.ఉమ, టి. అంజలి, బి. సుజాత, డి. జ్యోతి, పిల్లల తల్లిదండ్రులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంరక్షణ మా బాధ్యత

**ఎమ్మెల్యే రవిశంకర్**

**చొప్పదండి ఏప్రిల్ 28 (ప్రజా మంటలు) :** బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల సంరక్షణ తమ బాధ్యత అని చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన మినుగు అఖిలేష్ ఇటీవల ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందడంతో రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును శుక్రవారం మృతుని తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను ఆదుకోవడం తమ బాధ్యతగా



భావిస్తామన్నారు. అంతకుముందు మండలంలోని నూకపెల్లి గ్రామానికి చెందిన మునుగురి మోహన్ మరణించడంతో అతని భార్య విజయకు 5 లక్షల రూపాయల రైతు బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రామ్ మోహన్ రావు, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు మిట్టపల్లి సుదర్శన్, స్థానిక సర్పంచ్ రాసమల్ల హరీష్,మార్కెట్ కమిటీ చైర్మన్ కోరండ్ల నరందర్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ అయిల్నేని సాగర్ రావు, మండల కో ఆప్షన్ సభ్యులు అజారుద్దీన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు జనగం శ్రీనివాస్, మారం పెల్లి నారాయణ, ఆసం శివ, పొన్నం మల్లేశం, మోత్కు కొమురయ్య,మరాఠి గంగారెడ్డి జున్ను సురేందర్, కొంక నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి మార్కెట్ యార్డ్‌లో ధాన్యాన్ని పరిశీలించిన నాయకులు

**ధర్మపురి ఏప్రిల్ 28 (ప్రజా మంటలు) :** వ్యవసాయ మార్కెట్ కమిటి ధర్మపురి చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమార్ మార్కెట్ యార్డులో జిల్లా మార్కెటింగ్ కమిటీ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డునకు ఆరబెట్టిన



ధాన్యాన్ని తేమ 17శాతం మాత్రమే తేవాలని మరియు పచ్చి వడ్లను మార్కెట్ యార్డులోనికి అనుమతించబడవని తెలిపారు. అకాల వర్షాల వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఇట్టి విషయాన్నీ సాంఘిక సంక్షేమ శాఖా మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకవేల్లమని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైన ప్యాక్స్ చైర్మన్ సౌల్ల నరేష్ మరియు ఏ ఈ ఓ నవ్య, రైతులు తోట శ్రీనివాస్,అయ్యోరి మహేష్ ,ఎంకుస్ మహేష్, తదితరులు ,హమలిలు పాల్గొన్నారు.

## వ్యవసాయ న్యాయ సేవ కేంద్రాన్ని ప్రారంభించిన కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి నిహారిక

**కోరుట్ల ఏప్రిల్ 28 (ప్రజా మంటలు) :** ఐలపూర్ గ్రామంలో వ్యవసాయ న్యాయ సేవ కేంద్రాన్ని కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి నిహారిక ప్రారంభించిచారు.



ఐలపూర్ గ్రామానికి చెందిన గాడిచర్ల రాజీ రెడ్డి, రాజ్యం, గడికాడి మల్లయ్య. బోడ గంగాధర్, ఎలెటి లింగారెడ్డి, ఎలెటి పుల్లారెడ్డి మర్రిపల్లి సురేష్ లను పారా లీగల్ వాలంటీర్లను నియమించారు. వీరికి న్యాయ పరంగా శిక్షణ ఇచ్చి గ్రామంలో ఉన్న రైతులకు న్యాయపరమైన సలాహాలు సూచనలు ఇవ్వడమే ఈ వ్యవసాయ సేవ కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి నిహారిక తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు నర్సయ్య సెక్రటరీ బైరి విజయ్ ఉపాధ్యక్షులు సురేష్ కొంపల్లి రాజేంద్రప్రసాద్, చాప కిషోర్ చిలివేరి రాజశేఖర్ ప్రేమ్ అనాస్ ఫాసియొద్దీన్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## మహంకాళి ఆలయంలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**మిడిదొడ్డి ఏప్రిల్ 28 (ప్రజా మంటలు) :**సిద్దిపేట జిల్లా మిర్దొడ్డి మండలం కొండాపురం గ్రామంలో రెడ్డి సంగం ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి



దేవాలయంలో త్రయాహ్నిక దీక్షా పద్దతిలో పంచమ వార్షికోత్సవ కార్యక్రమం గ్రామ పురోహితులు బ్రహ్మ శ్రీ మాధవుని శ్రీనివాస శర్మ మరియు యలమంచి చంద్రశేఖరశర్మ మరియు ఛాడా చిరంజీవి శర్మగార్ల వైదీక నిర్వహణలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రెండవ రోజు శుక్రవారం సంధర్భంగా మహిళల చే కుంకుమార్చన నిర్వహించారు.

## సీఐ గారికి శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థి విభాగం నాయకులు..

జగిత్యాల టౌన్ సిఐగా ఇటీవలే బదిలీపై వచ్చిన రాంచందర్ రావు గారిని మర్యాద పూర్వకంగా కలిసిన జగిత్యాల టౌన్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు యం.ఏ ఆరీఫ్ , భగవాన్ రాజ్, జయంత్ నేత సల్మాన్, లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.




# మన పెద్ద బడి వజ్రోత్సవాలు

- హాజరైన మహిళలు, పూర్వ విద్యార్థులు

**హుస్నాబాద్ 28 ఏప్రిల్ (ప్రజామంటలు):** జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజా శర్మ మనబడి వజ్రోత్సవాలలో భాగంగా 5వ రోజు మహిళా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదట స్థానిక గాంధీ చౌరస్తా నుండి పాఠశాల వరకు బోనాలతో బతుకమ్మలతో మహిళలందరూ ర్యాలీగా



బయలుదేరి డప్పు చప్పులతో, వాయిద్యాలతో, రకరకాల సాంప్రదాయ నృత్యాలతో ఎంతో ఆహ్లాదకరంగా పాఠశాలను చేరుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మల చుట్టూ బతుకమ్మలు ఆడుతూ సందడి చేశారు. ప్రారంభోత్సవానికి ముందుగా టపాసులు కాల్చారు. అనంతరం పదవ తరగతి 1985-86 పూర్వ విద్యార్థులైచే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే విగ్రహము ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజా శర్మ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రోజా శర్మ మాట్లాడుతూ తెలంగాణలో ఒక పాఠశాల 70 వసంతాలు పూర్తిచేసుకుని వజ్రోత్సవాలు సప్తాహం పేరుతో వారం రోజులుగా నిర్వహించడం మొదటిసారి అని ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. సప్తాహం కార్యక్రమాల్లో మహిళలకు ఒక రోజు కేటాయించడం హర్షనియమని మహిళా ఇంటి పనులతో పాటు సమాజ కార్యక్రమాలను నిర్వహించుకోవాలని ఇది చాలా కష్టతరమైనదని పురుషులు సహకరించాలని కోరారు. ఈ పాఠశాల ఎంతో చక్కటి విద్యా బుద్ధులు నేర్పినది అనడానికి పాఠశాల నుండి అనేక రంగాలలో ప్రముఖులు ఉన్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే సతీష్ కుమార్ సతీమణి



సమీహ మాట్లాడుతూ.... మహిళలు అన్ని రంగులలో అభివృద్ధి చెందాలని వజ్రోత్సవాలలో మహిళల్లో భారీ చైతన్యాన్ని తీసుకు వచ్చిందని ఇలాంటి ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం అతిధులను సన్మానించి జ్ఞాపకాలు అందజేశారు. పూర్వ విద్యార్థి మహిళలందరూ కలిసి ఆటపాటలతో సందడి చేశారు. పాటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వజ్రోత్సవాల కన్వీనర్ కొండా లక్ష్మణ్, హుస్నాబాద్ మానస, ఎంపీపీ, కోహెడ ఎంపిపి కొక్కుల కీర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారి మనీల, అక్కన్నపేట జెడ్పిటిసి భూక్యా మంగ, హుస్నాబాద్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్మన్ ఐలేని అనిత రెడీ, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిని, మహిళా కౌన్సిలర్లు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పట్ల తెలంగాణ రైతు ఐక్యవేదిక హర్షం

**మెటుపల్లి ఏప్రిల్ 28 (ప్రజా మంటలు) :** తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో పండిన మొక్కజొన్న పంటను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేయడం పట్ల తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి, నాయకులు మామిడి నారాయణరెడ్డి, గురిజెల రాజరెడ్డి , కాటిపెల్లి నాగేశ్వర్ రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర లేక ఏక్కడ అమ్ముకోవాలో తెలియక అల్లాడుతున్న మొక్కజొన్న రైతుల ఆవేదనను , ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైతు సంఘాలతో పాటు ప్రజా ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి మార్క్ ఫెడ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం హర్షనీయమనీ కొనియాడారు. అలాగే 200 రూపాయల బోనస్ ను అదనంగా కల్పించి ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు . మొక్కజొన్న పంట కోతల ప్రారంభ సీజన్ లో బహిరంగ మార్కెట్లో క్వింటాలుకు 2500 రూపాయలకు పలికిన ధర ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు సిండికేట్ గా మారడంతో 1600 రూపాయలకు తగ్గించి రైతులను నష్టపరుస్తుండడంతో రైతుల ఇబ్బందులను , మానసిక ఆవేదనను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి కొనుగోలు



చేయాలని ఆదేశాలు జారీ చేయడం హర్షనీయమని వారు పేర్కొన్నారు . ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ , రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి లకు తెలంగాణ రైతు ఐక్యవేదిక పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

## కార్యకర్తల సంరక్షణ మా బాధ్యత

- ఎమ్మెల్యే రవిశంకర్

**మల్యాల,ఏప్రిల్ 28 (ప్రజా మంటలు) :** బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల సంరక్షణ తమ బాధ్యత అని చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన మినుగు అఖిలేష్ ఇటీవల ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందడంతో రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును శుక్రవారం మృతుని తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను ఆదుకోవడం తమ బాధ్యతగా భావిస్తామన్నారు. అంతకుముందు మండలంలోని నూకపెల్లి గ్రామానికి చెందిన మునుగురి మోహన్ మరణించడంతో అతని భార్య విజయకు 5 లక్షల రూపాయల రైతు బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రామ్ మోహన్ రావు, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు మిట్టపల్లి సుదర్శన్, స్థానిక సర్పంచ్ రాసమల్ల హరీష్,మార్కెట్ కమిటీ చైర్మన్ కోరండ్ల నరందర్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ అయిల్నేని సాగర్ రావు, మండల కో ఆప్షన్ సభ్యులు అజారుద్దీన్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు జనగం శ్రీనివాస్, మారం పెల్లి నారాయణ, ఆసం శివ, పొన్నం మల్లేశం, మోత్కు కొమురయ్య,మరాతి గంగారెడ్డి జున్ను సురేందర్, కొంక నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ హాట్ లుక్‌లో సుహానా!

బాలీవుడ్ స్టార్ కిడ్ సుహానా ఖాన్ ఇన్ స్టా సంచలనాల గురించి చెప్పాల్సిన పనిలేదు. స్టార్ గా ఎంట్రీ ఇవ్వకముందే ఎప్పటికప్పుడు మంటలు పుట్టిస్తుంది. ఫ్రెండ్స్ గ్యాంగ్ తో పార్టీలు..గెట్ టూ గెదర్ అంటూ చిట్టిపొట్టి దుస్తుల్లో చేసే రచ్చే అంతే ఆసక్తికరం. తాజాగా అమ్మడి కొత్త ఫోటో ఒకటి ఇన్ స్టాని షేక్ చేస్తుంది. బ్లూ కలర్ చెక్స్ లో హాట్ లుక్ లో అగ్గిరాజేస్తూ యువత గుండెల్లో మంటలు పుట్టిస్తుంది. ఈ ధగధగల వెనుక ఓ ప్రత్యేక కారణం కూడా ఉందండోయ్. ఇటీవలే ఇంటీరియర్ డిజైన్ల గురించి గౌరీ ఖాన్ విడుదల చేసిన పుస్తకం నుండి తీసిన చిత్రంలోని కొన్ని ఫోటోలివి. సుహానా ఐస్ బ్లూ మరియు వైట్ స్ట్రిప్డ్ బ్రాలెట్తో మ్యాచింగ్ కత్తిరించిన చొక్కా ధరించింది. బాటమ్ లో లేత గోధుమరంగు ప్యాంటుతో జతగా సోలోగా పోజులిచ్చింది. ఆమె విలాసవంతమైన ముంబై ఇల్లు - మన్నత్ అవుట్డోర్ సెట్టింగ్ని రీక్రియేట్ చేస్తున్నప్పుడు తిసిన ఫోటో ఇది. అందుకే ఎంతో ప్రత్యేకం గా ఈ ఫోటోని అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట జోరుగా వైరల్ అవుతుంది. సుహానా అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. అమ్మడి కెరీర్ సంగతి చూస్తే బాలీవుడ్ ఎంట్రీ ఎప్పుడా? అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కుమారుడు డైరెక్టర్ గా స్థిర పడాలని ప్లాన్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో షారుక్ అభిమానుల ఆశలన్నీ సుహానా పైనే పెట్టుకున్నారు. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని పెద్ద స్టార్ అవుతుందని భావిస్తున్నారు. జోయా అక్తర్ రాబోయే నెట్ఫ్లిక్స్ మూవీలో సుహానా అరంగేట్రం



చేస్తుంది. ఇదే సిరీస్ తో ఇంకా పలువురు స్టార్ కిడ్స్ పరిచయం అవుతున్నారు. దీంతో ఈ సిరీస్ పై భారీ అంచనాలే ఏర్పడుతున్నాయి



## ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో 'కళ్లు' బాగోలేవని విమర్శించేవారు

టీజర్ బాగున్న సినిమాలన్నీ బాగుండాలన్న రూల్ లేదు. ట్రైలర్ లో అదరగొట్టేసి.. ఆ తర్వాత అడ్రస్ లేకుండా పోయిన సినిమాలకు కొదవ లేదు. రెండు వారాల క్రితం రిలీజ్ అయిన విరూపాక్ష వీటికి భిన్నం. ట్రైలర్ తో ఆకర్షించి.. సినిమాతో మనసు దోచేసిన ఈ మూవీకి కలెక్షన్ల వర్షం ఎంతలా కురిసిందో తెలిసిందే. సాయి ధరమ్ తేజ్ కెరీర్ లో అత్యధిక వసూళ్లు సాధించిన ఈ మూవీ మీద ఆసక్తికర చర్చ నేటికి సాగుతోంది. సాయి ధరమ్ తేజ్ ఇమేజ్ ను.. మార్కెట్ ను పెంచేసిన ఈ మూవీ కారణంగా హీరోయిన్ సంయుక్త కు కూడా హెల్ప్ చేసిందని చెప్పాలి. ఆమె ధరించిన పాత్ర ఆమెకు నెగిటివ్ అయ్యే అవకాశం ఉన్నా.. ప్రేక్షకుల మనసులో మాత్రం పాజిటివ్ గానే రిజిస్టర్ కావటమే కాదు.. ఆమె అందానికి ఫిదా అయిపోయిన ప్రేక్షకులెందరో. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె ఆసక్తికర విషయాల్ని వెల్లడించారు.తన సినిమా జర్నీ గురించి ఆమె ఆసక్తికర విషయాల్నివెల్లడించారు. విరూపాక్ష మూవీలో ఆమె కళ్లు హైలెట్ కావటమే కాదు.. ఆమె కళ్లను పొగిడే సీన్ ప్రత్యేకంగా ఉండటమే కాదు.. ఆమె కళ్ల అట్రాక్షన్ లో పడిపోవటం ఖాయం. అలాంటి అందమైన కళ్లను పట్టుకొని.. మొదట్లో విమర్శలు చేసేవారన్నారు. కెరీర్ ఆరంభంలో లభించిన అవకాశాల్ని వినియోగించుకునే వేళలో.. తన కళ్ల మీద బోలెడన్నివిమర్శలు చేయటంతో పాటు.. చిన్న కళ్లు అని వేలెత్తి చూపేవారని పేర్కొన్నారు. అలాంటిది విరుపాక్షలో తన కళ్ల కారణంగా ఈ అవకాశం లభించిందని చెప్పారు. 2021లో బింబిసారలో తనకు అవకాశం లభించిన సమయంలో ఆ సినిమాను రెండు భాగాలుగా చేస్తామని చెప్పారన్నారు. కథ విన్నంతనే భిన్నంగా ఉందని ఒప్పుకున్నట్లు చెప్పిన సంయుక్త.. తర్వాత తన పాత్రకు మార్పులు జరిగాయన్నారు. అయినా తాను బాధ పడటం లేదని.. అంతిమంగా సినిమా బాగా వచ్చిందా? రాలేదా? అన్నదే తాను చూస్తానని చెప్పారు. బింబిసార విడుదలయ్యాక తనకు విరూపాక్ష టీం నుంచి కాల్ వచ్చిందన్నారు. దర్శకుడు కార్తిక్ జూమ్ కాల్ చేసి.. రెండున్నర గంటల పాటు కథ చెప్పి.. సింగిల్ లైన్ నేరషన్ అన్నారన్నారు. ఆడిషన్ కు రమ్మని చెప్పి.. కళ్ల పైనే ఆడిషన్ చేశారన్నారు. ప్రేమ.. కోసం.. జాలి.. ఇలా పలు భావోద్వేగాల్ని కళ్లతో పలికించమని చెప్పారని.. వారు పెట్టిన పరీక్షలో తాను పాస్ అయినట్లు చెప్పారు. తన కెరీర్ ఆరంభంలో తన కళ్ల గురించి చాలా విమర్శల్ని ఎదుర్కొన్నట్లు చెప్పారు. ఇప్పుడు అవే కళ్లతో ఇంత మంచి అవకాశం వచ్చిందని చెప్పారు. చూసే కళ్లకు తగ్గట్లే.. కళ్ల అందం తెలుస్తుందన్న విషయం సంయుక్తకు ఇప్పుడు కచ్చితంగా అర్థమై ఉంటుంది

## ఆర్జీవి నిజం.. అసలు నిజం ఇదేనా..?

విషయం ఏదైనా సరే అక్కడ ఆర్జీవి ఉన్నాడు అంటే అసలు మ్యాటర్ వదిలి కొత్త మ్యాటర్ వార్తల్లోకి వస్తుంది. ఒక విషయాన్ని ప్రపంచం అంతా ఒకలా తను మరోలా ఆలోచిస్తాను అనుకుంటాడు ఆర్జీవి ఒకప్పుడు అతని మాటలను నమ్మిన ప్రేక్షకులు తర్వాత మోసపోయాం అనుకున్న సందర్భాలు ఉన్నాయి. సినిమా దర్శకుడిగా పాపులర్ అయ్యి తన మేధస్సుతో ప్రపంచాన్ని మొత్తం కడిగిపారేస్తా అంటూ చెలరేగిపోతుంటాడు వర్మ. ఏదో సినిమాలో డైలాగ్ లాగా ఒకడు నాకు ఎదురొచ్చినా వాడికే రిస్కు. లేదా నేను వాడికి ఎదురెళ్లినా వాడికే రిస్క్ అని చెప్పినట్టుగా ఆర్జీవితో ఏదైనా డిబెట్ పెడితే ఇవతల వారు తగ్గాలే తప్ప ఆయన నెగ్గానని సంతృప్తి చెందేవరకు డిబెట్ కొనసాగిస్తూనే ఉంటాడు. ఆర్జీవి అంత మేధావి మరొకరు లేరని కొందరు.. అసలు ఆర్జీవి పరమ వేస్ట్ అనే వారు కొందరు. ఇలా ప్రపంచం తన గురించి ఏమనుకుంటుందో నాకు అనవసరం నేనన్నది నిజం అంటూ తన పంథా తను కొనసాగిస్తున్నాడు ఆర్జీవి. ఇదిలా ఉంటే సడెన్ గా నిజం అంటూ ఒక కొత్త యూట్యూబ్ ఛానెల్ ని మొదలు పెట్టాడు ఆర్జీవి. ఆర్జీవి వెళ్తే ఏదో ఒక ఛానెల్ స్లాట్ ఇచ్చి ఏదో ఒక విషయం మీద డిబెట్ పెట్టేస్తారు. అయితే అది ఒకప్పుడు ఆర్జీవికి ఉన్న క్రేజ్ దృష్ట్యా అలా చేశారు. ఒకానొక టైం లో ఆర్జీవి స్టూడియోలో ఉంటే ఛానల్ రేటింగ్ అమాంతం పెరిగేది. కానీ ఇప్పుడు ఆర్జీవి తన స్టాండర్డ్ సినిమాలు చేయట్లేదు సరికదా అమ్మాయిల కాళ్లు వేళ్లను ముద్దులాడుతూ కనిపిస్తున్నాడు. ఆర్జీవి ఒక గొప్ప మేధా శక్తి ఉన్న వాడే కావొచ్చు కానీ ఏది దాచుకోకపోవడం బుద్ధిమంతులకు తెలియదా అని అనుకోవచ్చు. ఇంతకీ ఆర్జీవి నిజం ఎందుకు పెట్టాడు అంటే తనను ఎవరు స్టూడియోలకు పిలవట్లేదని పెట్టినట్టు ఉన్నాడని ఆడియన్స్ రియాక్షన్. నిజం అసలైన నిజం అంటూ ఆర్జీవి ఏదో కొత్తగా చెప్పాలని చూస్తున్నాడు. సినిమాల మీద తన క్రియేటివిటీని పక్కన పెట్టి తన తెలివితేటలతో ఆడియన్స్ ని తనను టార్గెట్ చేసిన వారిని బకరాలను చేయడం ఆర్జీవికి అలవాటే. ఇంతకీ ఆర్జీవి నిజం ఛానెల్ ఎందుకు పెట్టాడు.. ఆ నిజం వెనుక అసలు నిజం ఏంటి అన్నది మరికొద్ది రోజుల్లో తెలుస్తుంది.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com